ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 1, అక్టోబరు 2025



ఒంగోలు బాలాజీరావుపేటలోని కనకదుర్గమ్మ కళారం



ఉత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు



శరన్నవరాత్రుల సందర్భంగా ఒంగోలు లాయర్‌పేట సాయిబాబా మందిరంలో నాట్యం చేస్తున్న బాలికలు

అబ్బురం.. కళారాల సంబరం..

దసరా సందర్భంగా ఒంగోలులో ఏటా రెండు రోజులపాటు నిర్వహించే కళారాల సంబరం మంగళవారం రాత్రి మొదలైంది. తొలిరోజు కనకదుర్గమ్మ, నరసింహస్వామి, మహిషాసురమర్ధిని కళారాల ఉత్సవం ఉత్సాహంగా సాగింది. డీజే సౌండ్స్, తప్పెట్లు, కళాకారుల వేషధారణలు, విన్యాసాలు అబ్బురపరిచాయి. పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజానీకంతో నగరంలోని ప్రధాన వీధులు కిక్కిరిసిపోయాయి. మరోవైపు శరన్నవరాత్రులు తొమ్మిదో రోజైన మంగళవారం వైభవోపేతంగా జరిగాయి. అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు సాక్షాత్కరించారు. ఈ సందర్భంగా ఒంగోలు లాయర్‌పేట సాయిబాబా మందిరంలో బాలికలు ప్రదర్శించిన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు

నేటి నుంచి రేషన్ పంపిణీ

- ఈనెలలో కూడా కందిపప్పు లేదు



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభవుతోంది. అందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా 6.61 లక్షల కార్డుదారులకు బియ్యం, చక్కెరను పంపిణీ చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు మొబైల్ వాహనాల ద్వారా సరుకులు ఇవ్వగా, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా రెండు పూటలా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంది. వృద్ధులు, దివ్యాంగులకు ముందుగానే వారి నివాసాల వద్దకు వెళ్లి సరుకులు అందిస్తోంది. కాగా జిల్లాలో రేషన్ కార్డుదారులకు అక్టోబరులో కూడా కందిపప్పు లేదు. ఎనిమిది నెలల నుంచి రేషన్ షాపులకు కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. బహిరంగ మార్కెట్లో ధర అమాంతంగా పెరిగిపోవడంతో సబ్సిడీపై ఇచ్చే కందిపప్పును తీసుకునేందుకు పేదలు ఎదురుచూస్తున్నారు. అయితే ఈనెలలో కూడా ఆ అవకాశం లేకుండా పోయింది. కార్డుదారులకు డీలర్లు కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇవ్వనున్నారు.

ఒంగోలు.. జిగేల్!



ఒంగోలు ట్రంక్‌రోడ్డులోని చర్చి సెంటర్ నుంచి దక్షిణ బైపాస్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ వెలుగులు నగరానికి మరింత అందాలను తెచ్చాయి. ఆ రోడ్డులో సెంటర్ డివైడర్ నందు గతంలో 120 స్తంభాలు ఉండగా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో వాటి స్థానంలో కొత్తగా 150 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఐమాస్ట్‌తోకూడిన సెంట్రల్ లైటింగ్‌ను మంగళవారం కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. దీంతో నగర ప్రధాన రోడ్డు చర్చిసెంటర్ నుంచి నెల్లూరు బస్టాండ్, రామ్‌నగర్, జడ్పీ ఆఫీస్, దక్షిణ బైపాస్ వరకూ విద్యుత్ కాంతులతో జిగేల్‌మంటోంది.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్



ఆటో డ్రైవర్లకు రూ.15వేలు

- జిల్లాలో 12,091 మంది గుర్తింపు
- 12,423 దరఖాస్తులు, 326 తిరస్కరణ
- హోల్డ్‌లో ఆరు దరఖాస్తులు
- 4న లబ్ధిదారుల ఖాతాలలో నగదు జమ

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు అడగకుండానే కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.15వేలు ఇచ్చేందుకు సిద్ధమైంది. గతంలో వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.10వేలు అందజేసింది. అయితే ఇటీవల రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు నష్టపోకుండా ప్రభుత్వం వారికి భరోసా కల్పించేందుకు 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రకటించింది. లబ్ధిదారుల ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లావ్యాప్తంగా 12,423 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని

మిగతా 4వ పేజీలో

తొలిదశ పూర్తే లక్ష్యంగా..!

వెలిగొండపై అధికారుల కసరత్తు

మిగిలి ఉన్న పనులపై ఎస్ఈ సమీక్ష

వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పనులు వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తిచేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుపై తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన సూచనలు ఇస్తున్నారు. పనులకు సంబంధించి కావాల్సిన నిధుల మంజూరు, అదనపు పనులకు అనుమతులు త్వరితగతిన ఇచ్చేలా చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకూ చేసిన పనులకు సంబంధించి పెండింగ్ ఉన్న బిల్లులలో 90శాతం విడుదల చేశారు. అందులో గత వైసీపీ ప్రభుత్వకాలంలో పెండింగ్‌వి కూడా ఉన్నాయి. ఈ పరిణామాలన్నీ నిర్దేశిత గడువులోపు వెలిగొండ పూర్తిపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతున్నాయి.

- రూ.344 కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించిన ప్రభుత్వం
- ఫీడర్ కాలువ ఆధునికీకరణకు తాజాగా రూ.456 కోట్లు మంజూరు
- నాలుగు భాగాలుగా రెండో టన్నెల్ లైనింగ్ పనులు



వెలిగొండ పెండింగ్ పనులు, సాంకేతిక అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఈ అబూత్‌అలీ

ఒంగోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రచార ఆర్భాటం తప్ప ఆచరణలో వెలిగొండ ప్రాజెక్టు పనులు పెద్దగా జరగలేదు. పైగా చేసిన పనులకు కూడా చెల్లింపులు సరిగా చేయలేదు. అలా 2022 నుంచి పలువురు కాంట్రాక్టర్లకు బిల్లులు ఆగిపోయాయి. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వెలిగొండపై ప్రత్యేక దృష్టి సారించింది. తరుచూ సీఎం చంద్రబాబు సమీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పాత బకాయిల చెల్లింపు, అలాగే కొత్తగా ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులకు అనుమతులు అత్యవసరంగా గుర్తించారు. ఈనేపథ్యంలో ఈ రెండు అంశాలపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పెండింగ్ బిల్లులు సుమారు రూ.375 కోట్ల మేర ఉన్నట్లు గుర్తించగా అందులో రూ.344కోట్లను ఇటీవలే ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించింది. ప్రస్తుత ఏడాది ప్రాజెక్టు పనులకు బడ్జెట్‌లో రూ.390 కోట్లు కేటాయించారు. అప్పట్లో ఆ నిధులు ఎలా సరిపోతాయన్న విమర్శలు వచ్చాయి. పనులు జరిగే కొద్దీ సమకూర్చుతామని నిధులపై బెంగపడాల్సిన అవసరం లేదన్న సమాధానం ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చింది. తదనుగుణంగానే వ్యవహరిస్తూ నాటి వైసీపీ కాలం నుంచి ఉన్న బకాయిలను కూడా పరిశీలించి చెల్లించారు. ఇక చేసిన పనులకు సంబంధించి కేవలం రూ.30కోట్ల లోపు మాత్రమే బకాయిలు ఉన్నట్లు అధికారవర్గాల సమాచారం.

ఫీడర్ కెనాల్‌కు సిమెంట్ లైనింగ్

మరోవైపు ప్రాజెక్టు తొలిదశ పూర్తయి డ్యాంలోకి నీరు నింపాలంటే ఫీడర్ కాలువ ఆధునికీకరణ

మిగతా 4వ పేజీలో



ఒంగోలు గాంధీరోడ్డులో తొలగించిన గ్రామ చావిడి

కాలగర్భంలో గ్రామ చావిడి!

ఒంగోలులోని వీఆర్వోల కార్యాలయం తొలగింపు

రెవెన్యూ సేవలు అందించడం కోసం ఒంగోలులో తొలిసారిగా నిర్మించిన వీఆర్వోల కార్యాలయం (గ్రామ చావడి) కాలగర్భంలో కలిసిపోయింది. స్థానిక గాంధీరోడ్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో ఉన్న గ్రామచావడి వందేళ్లకు పైగా చరిత్ర కలిగి ఉంది. పూర్వం రెవెన్యూ సేవల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లకుండా ముందుగా వీఆర్వోలను కలిసేందుకు ప్రత్యేకంగా దీనిని ఏర్పాటు చేశారు. బ్రిటీష్ కాలంలో సుమారు 120 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ చావడిలో సుదీర్ఘకాలంగా వీఆర్వోలు సేవలు అందించారు. కాలానుగుణంగా ఆన్‌లైన్ విధానం, ఆ తర్వాత వార్డు సచివాలయాలు అందుబాటులోకి రావడంతో కొన్నేళ్లుగా ఈ కార్యాలయం మూతపడి నిరుపయోగంగా మారింది. మంగళవారం రెవెన్యూ అధికారులు దానిని పూర్తిగా తొలగించారు. అందిన సమాచారం మేరకు ఆ స్థలంలో త్వరలో నూతనంగా భవనం నిర్మించి రెవెన్యూ సేవలను పునరుద్ధరించనున్నట్లు సమాచారం.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్

2,84,279 మంది లబ్ధిదారులు.. రూ.124.89 కోట్లు..

- నేడు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి ఇవ్వనున్న సచివాలయ సిబ్బంది

ఒంగోలు నగరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ బుధవారం జరగనుంది. జిల్లాలోని 2,84,279 మంది లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్మును అందజేయనున్నారు. అందుకు అవసరమైన రూ.124.89 కోట్లను ప్రభుత్వం రెండు రోజుల క్రితమే విడుదల చేసింది. వాటిని సోమవారమే వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచారు. బుధవారం ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి పింఛన్ సొమ్మును అందజేయనున్నారు. జిల్లాలోని 719 సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందించేందుకు 5,546 మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. ఎక్కడా ఎలాంటి ఆటంకం లేకుండా పర్యవేక్షించాలని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు.

ఒక్కరికీ నిలిపివేయలేదు!

ప్రభుత్వం బోగస్ పింఛన్‌దారులను ఏరివేసే ప్రక్రియలో భాగంగా వందలాది మందికి సచివాలయాల ద్వారా గత నెలలో నోటీసులు జారీ

మిగతా 4వ పేజీలో



ఇసుక లారీలను అడ్డుకుంటే చర్యలు

- మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హెచ్చరిక
- ఒంగోలు ఇసుక యార్డు నిర్వాహకులకు నోటీసులు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణా చేస్తున్న లారీలను అడ్డుకుంటే చర్యలు తప్పవని మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ హెచ్చరించారు. 'ఇసుక ప్రియం' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆ మేరకు ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. ఇసుక లారీలను అడ్డుకుంటున్న ప్రైవేటు సైన్యం ఒంగోలు ఇసుక యార్డుకు చెందిన వారిగా గుర్తించి నోటీసులు ఇచ్చామన్నారు. వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఒంగోలులోని స్టాక్ యార్డులో ఇసుక ధర టన్ను రూ.980గా నిర్ణయించామన్నారు. అయితే నెల్లూరు ఇసుక రీచ్ నుంచి నేరుగా బుక్ చేసుకొని వినియోగదారులు తెచ్చుకోవచ్చన్నారు. భూగర్భ, గనుల శాఖ అధికారులకు ఎలాంటి మామూళ్లు, లాలూచీ లేదని వివరించారు. ప్రస్తుతం ఇసుకకు కొరత లేదని చెప్పారు. యథేచ్ఛగా సొంత అవసరాల కోసం తరలించుకోవచ్చని స్పష్టం చేశారు.

గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు షట్‌డౌన్

- యజమానుల అత్యవసర సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం
- సీనరేజీ వసూలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన
- వైసీపీకి మద్దతుగా ఉన్న ఓనర్లు రెచ్చగొట్టే ధోరణి
- ప్రభుత్వంతో సానుకూలంగా వ్యవహరించి సమస్య పరిష్కరించుకోవాలని మెజారిటీ సభ్యుల అభిప్రాయం

4

అందానికి.. ఆరోగ్యానికి శాఖాహారం..! 5 | రక్తదానం.. ప్రాణదానం..! 5 | అమృతమూర్తులు అమ్మానాన్నలు..! 5

చిత్రజ్యోతి

SINCE 1965

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు.

కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగి మణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

వంతెనను ఢీకొట్టిన లారీ



వంతెనపై వేలాడుతున్న లారీ

కొమరోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు వంతెనను మినీ లారీ ఢీకొట్టిన ఘటన మండలంలోని అల్లినగరం గ్రామ సమీపంలో జరిగింది. చెన్నై నుంచి కంభంకు అల్లం లోడుతో వస్తున్న లారీ అల్లినగరం వద్ద వంతెనను ఢీకొట్టింది. డ్రైవర్ చాకచక్యంతో అదుపుచేయడంతో ప్రమాదం తప్పింది.

రూ.124.89 కోట్లు!

(3వ పేజీ తరువాయి)

చేసింది. వాటిని అందుకున్న వారిలో కొందరు తాము పింఛన్ పొందేందుకు అర్హులమంటూ ప్రభుత్వానికి అప్పీలు చేసుకున్నారు. ఎక్కువ మంది తిరిగి తమ అర్హతను పరిక్షించాలని ప్రభుత్వాన్ని కోరలేదు. ఇలాంటి వారికి ఈ నెలలో పింఛన్ పంపిణీ నిలిపివేస్తారని అందరూ భావించారు. అయితే ప్రభుత్వం ఈనెలలో ఏ ఒక్కరికీ కూడా పింఛన్‌ను నిలుపుదల చేయలేదు. గత నెలలో పింఛన్ పంపిణీ చేసిన అందరికీ ఈనెలలో కూడా ఇంటి వద్దనే పింఛన్ సొమ్మును అందజేయనున్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

- ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు కంప్యూటరీకరణ
- మంత్రి డాక్టర్ స్వామి
- 63 మందికి రూ.32.21 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను కంప్యూటరీకరిస్తున్నామని చెప్పారు. తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం 63 మందికి రూ.32.21 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలని, వారికి ఆర్థికంగా అండగా నిలవాలన్న ధ్యేయంతో సీఎం చంద్రబాబునాయుడు పని చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 880 మందికి రూ.7.27కోట్ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే అమలు చేసిందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం పథకం వంటి సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చిందన్నారు. దసరా రోజున ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు అందిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులతోపాటు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

ఆటో డ్రైవర్లకు రూ.15వేలు

(3వ పేజీ తరువాయి)

పరిశీలించిన అధికారులు వివిధ కారణాలతో 326మంది దరఖాస్తులను తిరస్కరించారు. ఆరింటిని హోల్డ్‌లో ఉంచారు. మొత్తం 12,091 మందిని ఎంపిక చేశారు. వారికి ఈనెల 4న బ్యాంక్ ఖాతాలలో రూ.15వేల చొప్పున జమ చేయనున్నారు.

గతం కంటే ఎక్కువ...

లబ్ధిదారుల ఎంపిక క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేశారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24లో కేవలం 10,741 మంది లబ్ధిదారులకు మాత్రమే వాహన మిత్ర పథకం అమలు చేశారు. అప్పట్లో ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 వేలు మాత్రమే ఇచ్చారు. ప్రస్తుతం లబ్ధిని రూ.15వేలకు పెంచి 12,091 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రజాప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఎలాంటి హామీ ఇవ్వకుండా వాహనమిత్ర పథకం అమలు చేస్తోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన

లబ్ధిదారుల జాబితా తయారీకి క్షేత్రస్థాయిలో యంత్రాంగం సూక్ష్మ పరిశీలన చేసింది. గ్రామ సచివాలయం నుంచి దరఖాస్తులు ఆహ్వానించిన యంత్రాగం లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలించి మండల స్థాయిలో జాబితాలు తయారు చేశారు. ఈ జాబితాలను స్వయంగా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. గ్రామ, వార్డు సచివాలయాలలో మంగళవారం నుంచి లబ్ధిదారుల జాబితా ఉంచినట్లు చెబుతున్నారు.

లబ్ధిదారుల జాబితాలు సిద్ధం
ఆర్.సుశీల, డీటీసీ

ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశాం. జిల్లాలో 12,091 మంది అర్హత సాధించారు. మొత్తం 12,423 దరఖాస్తులు రాగా వివిధ కారణాలతో 326ని తిరస్కరించాం. ఆరు హోల్డ్‌లో పెట్టాం. ఆ దరఖాస్తులపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 4న లబ్ధిదారుల ఖాతాలలో రూ.15 వేలు నగదు జమ అవుతుంది.

తొలిదశ పూర్తే లక్ష్యంగా..!

(3వ పేజీ తరువాయి)

అత్యవసరమని అధికారులు నివేదించారు. టన్నెల్ నుంచి నీరు బయటకు వచ్చే దోర్నాల మండలం కొత్తూరు ప్రాంతం నుంచి 21.80 కి.మీ దూరం ఫీడర్ కాలువ ద్వారా నీరు ప్రవహించి డ్యాంలోకి చేరుతుంది. ఆ కాలువను జలయజ్ఞంలో భాగంగా 15 ఏళ్ల క్రితం తవ్వారు. అందుకు సుమారు రూ.105 కోట్ల మేర వెచ్చించారు. ప్రస్తుతం ఆ కాలువల నీరు సజావుగా ప్రవహించే పరిస్థితి లేదు. దీంతో మొత్తం కాలువకు సిమెంట్ లైనింగ్‌తోపాటు మూడుచోట్ల సుమారు 5.6 కి.మీ మేర కాంక్రీటు గోడల నిర్మాణం అవసరంగా నిపుణులు సూచించారు. అందుకోసం రూ.456 కోట్లు అవసరమని అధికారులు నివేదించగా ఐదు రోజుల క్రితం ఆ పనులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో తక్షణం టెండర్లు పిలిచేలా ఉన్నత స్థాయిలో అధికారులు చర్యలు చేపట్టారు. రెండు రోజుల్లోనే టెండర్లు పిలువనున్నట్లు తెలుస్తోంది.

అధికారులతో ఎస్‌ఈ సమీక్ష

తాజా పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా పెండింగ్ పనులను సకాలంలో పూర్తిచేసే వైపు ప్రాజెక్టు అధికారులు దృష్టి సారించారు. ఇందుకు సంబంధించి ప్రాజెక్టు ఎస్‌ఈ అబూత్‌అలి మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో వివిధ స్థాయి ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయ్యారు. పెండింగ్ పనులు, వాటికి సంబంధించి సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారం, ఏ పనులు ఎప్పటికి పూర్తి చేయాలన్న దానిపై సమీక్షించారు. ప్రస్తుతం కీలకమైన రెండో టన్నెల్‌లో పెండింగ్ ఉన్న లైనింగ్ పనులు జరుగుతున్నాయి. టన్నెల్ తవ్వకం మిషన్ ద్వారా చేసే సమయంలో లైనింగ్ కూడా ఒకేసారి సిమెంట్ కాంక్రీట్ సెగ్మెంట్లకు అమర్చేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో అందుకు భిన్నంగా తవ్వకాలు చేపట్టడం వల్ల లైనింగ్ చేయలేదు. ప్రస్తుతం గ్యాంట్రీ విధానంలో పెద్దపెద్ద గడ్డర్ల సాయంతో కాంక్రీట్ లైనింగ్ చేస్తున్నారు. మొత్తం 18.8 కి.మీ ఉండే టన్నెల్‌లో 4.50 కి.మీ అలా చేయాల్సి ఉండగా త్వరితగతిన పూర్తి కోసం నాలుగు భాగాలుగా లైనింగ్ పనులు నిర్ణయించారు. అలాగే ఫీడర్ కాలువ, తూర్పు ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటరీ, తీగలేరు కాలువకు షట్టర్ల ఏర్పాటు, అర్ధవీడు మండలంలో ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం వంటి కీలక పనులపైనా సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. మొత్తం మీద వెలిగొండ తొలిదశకు నిర్దిష్ట గడువు పెట్టి నిధుల కల్పనకు సీఎం భరోసా ఇవ్వడం, ఫీడర్ కాలువ పనులుకు నిధుల మంజూరు నేపథ్యంలో పనులు వేగవంతం సాగే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు షట్‌డౌన్ !

- ఓనర్ల అత్యవసర సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం
- సీనరేజీ వసూలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన గళం
- ఏఎంఆర్ సంస్థ తీరుపై ఆక్షేపణలు
- నేటి నుంచి ఫ్యాక్టరీల మూత
- వైసీపీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న ఓనర్లు రెచ్చగొట్టే ధోరణి
- ప్రభుత్వ సానుకూలతతో సమస్య పరిష్కరించుకోవాలని మెజారిటీ యజమానుల నిర్ణయం

చీమకుర్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ అనుబంధ పరిశ్రమగా విరాజిల్లుతున్న గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ ఫ్యాక్టరీలు బుధవారం నుంచి మూతవేయనున్నారు. సీనరేజీ వసూలు ప్రైవేటీకరణ చేసిన నేపథ్యంలో పరిశ్రమ మనుగడ కోల్పోయే పరిస్థితి ఉత్పన్నం అవుతుందన్న ఆందోళనలో ఉన్న ఓనర్లు మంగళవారం రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెజారిటీ ఓనర్లు ఫ్యాక్టరీలు మనుగడకు మూసివేతే పరిష్కార మార్గమంటూ మొగ్గటంతో అసోసియేషన్ నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సీనరేజీ వసూలు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ ఇంకా రంగంలోకి రాకుండానే తమ పట్ల బెదిరింపు ధోరణిని అవలంబిస్తూ శ్లాబ్ సిస్టంలో ప్రభుత్వానికి చెల్లించే రాయల్టీతో సంబంధం లేకుండా అదనంగా తమకు చెల్లించాలని డిమాండ్ చేస్తుండటం కటింగ్ ఫ్యాక్టరీల మనుగడను దెబ్బతీసేవిధంగా ఉందన్న ఆందోళన ఓనర్లు వ్యక్తం చేశారు.

వైసీపీ అనుకూల ఓనర్ల అత్యుత్సాహంతో..

సమావేశం ప్రారంభమైన తర్వాత నాయకులు ఒక్కొక్కరుగా ప్రసంగిస్తూ సాధకబాధలు తెలుపుకుంటూ సమస్య పరిష్కారానికి ఏమి చేయాలని హాజరైన ఓనర్ల అభిప్రాయాలను అడిగారు. గతంలో ఎన్నడూ అసోసియేషన్ సమావేశానికి హాజరుకాని వైసీపీ అనుకూల ఓనర్లు వ్యూహాత్మకంగా కలిసికట్టుగా వచ్చి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేవిధంగా ప్రసంగించారు. రోడ్డెక్కి భారీగా నిరసనలు తెలిపి ప్రభుత్వంతో పోరాట వైఖరిని అవలంబించాలని పిలుపునిచ్చారు. ఈ దశలో జోక్యం చేసుకున్న అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య వారి తీరును గర్హించారు. ప్రభుత్వంతో సానుకూలంగా వ్యవహరించి తమ సమస్యను పరిష్కరించుకుందామని అనటంతో హాజరైన ఓనర్లలో ఎక్కువ మంది సానుకూలత వ్యక్తం చేశారు. తమ నిరసన తెలియచేస్తూ అక్టోబరు నెలలో శ్లాబ్ సిస్టంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని చెల్లించకూడదని, పక్కాగా ఫ్యాక్టరీలను మూసివేసి తమ నిరసన తెలియచేద్దామని, ఏఎంఆర్ సంస్థ దిగి వచ్చి ప్రభుత్వ నిబంధనల మేరకు రాయల్టీ వసూలు చేసేవిధంగా ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందచేయటం ద్వారా ఒత్తిడి తీసుకువద్దామని తీర్మానించారు. చీమకుర్తి, బూదవాడ, మర్రిచెట్లపాలెం, ఏలూరురోడ్డులో దాదాపు 700 గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు ఉండగా దాదాపు ఓనర్లందరూ హాజరయ్యారు. వీరి నిరసన గళం ఎటువైపు దారితీస్తుందో వేచిచూడాల్సి ఉంది. సమావేశంలో కాట్రగడ్డ రమణయ్య, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, యర్రగుంట్ల శ్రీనివాసరావు, గోగినేని నాగయ్య, గోగినేని శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి మధుసూదనరావు, నూకల సురేంద్ర, మన్నం శ్రీధర్, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, క్రిస్టిపాటి శేఖరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకుడు కాట్రగడ్డ రమణయ్య



అందానికి.. ఆరోగ్యానికి శాఖాహారం..!

ఆధునిక ఆహారపు అలవాట్లు

చిన్నవయస్సులోనే అనారోగ్య సమస్యలు

నేడు ప్రపంచ శాఖాహార దినోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో అందరిలోనూ అనారోగ్య సమస్యలే.. అందుకు వైద్యులు చెప్పే సమాధానం ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని. ఈ మాట మాంసాహార ప్రియులకు మింగుడు పడకపోయినా, అందం.. ఆరోగ్యం కోసం ఆహారపు అలవాట్లు మార్పు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జంక్ ఫుడ్‌లు, మాంసాహార ఆహారపదార్థాలతో చిన్న వయస్సులోనే ఊబకాయంతోపాటు ఇతర అనారోగ్య సమస్యల బారినపడుతున్నారు. శాఖాహారంతోనే సరైన జీవనం, ఆరోగ్యం లభిస్తాయని వైద్యులు వెల్లడిస్తున్నారు. నేడు ప్రపంచ శాఖాహార దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● శాఖాహార దినోత్సవం పేరు ఎలా వచ్చింది ?

శాఖము, ఆహారం అనే రెండు పదాలు కలయిక శాఖాహారం. శాఖము అంటే చెట్టు. శాఖాహారం అంటే మొక్కల నుంచి వచ్చే ఆహారం అని అర్థం. శాఖాహారం వలన కలిగే ప్రయోజనాలను మానవజాతికి తెలియచెప్పి, ఈ ఆహారాన్ని ప్రోత్సహించేందుకు 1977లో అక్టోబర్ 1న ప్రపంచ శాఖాహార దినోత్సవంగా ప్రకటించారు. మొదట్లో 1974లో నార్త్ అమెరికన్ శాఖాహార సొసైటీ ఏర్పాటు చేశారు. దీనిని ఏర్పాటు వెనుక రెండు ప్రధానమైన ఉద్దేశ్యాలు ఉన్నాయి. సొసైటీ సభ్యులకు మద్దతుగా నెట్ వర్క్ ఏర్పాటు చేయడానికి సంబంధిత గ్రూపుల శాఖాహారులకు మద్దతు ఇవ్వడం ఒక భాగం కాగా, శాఖాహారం ఏ విధమైన ప్రయోజనాలను ప్రజలకు చెప్పడమే రెండవ ఉద్దేశ్యం. 1997లో నార్త్ అమెరికన్ సొసైటీ ప్రపంచ శాఖాహార దినోత్సవంగా వార్షిక వేడుకలు ప్రకటించగా, 1978లో ఇంటర్నేషనల్ వెజిటేరియన్ యూనియన్ ఆమోదాన్ని తెలిపి, అక్టోబర్ 1న ప్రపంచ శాఖాహార దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది.

● మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లు

నేటి ప్రపంచంలో ఆరేళ్ల చిన్నారి నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు పోటీ ప్రపంచంతో పరుగులు పెడుతున్నారు. తద్వారా అతి చిన్న వయస్సు నుంచే వివిధ రోగాలకు గురవుతున్నారు. మసాలా దట్టించిన ఘుమ ఘుమలాడే మాంసాహారాన్ని లొట్టలేసుకుని తినేవారు ఆకుకూరలు, కూరగాయలపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ధరకు, ఎక్కువ పోషకాలు అందించే కూరగాయలు తోడుంటే ఆరోగ్యం మీ వెంటే అంటున్నారు వైద్యులు. అనారోగ్య సమస్యలతో సతమవుతూ టాబ్లెట్లను చాక్లెట్‌లా మింగే వారు శాఖా ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు.



● పోషక విలువల వైపు మొగ్గు

పూర్వం జ్వరం వస్తే పత్యం కోసం ఆకు కూరలు, కాకిదొండాకు పెట్టేవారు. దాంతో తేలిగ్గా ఆహారం జీర్ణం అవుతుంది. అంతేకాదు మనదేశంలో ఆహారం కోసం ఉపయోగించే మొక్కలు సుమారు 6వేల జాతులుంటే అందులో మూడొంతుల ఆకు కూరలేనట. పాలకూర, గోంగూర, తోటకూర, మెంతి కూర, కొత్తిమీర, మునగాకు ఇతర ఆకుకూరలతోపాటు కూరగాయలు తినడం ద్వారా ఎలాంటి రోగాలు దరిచేరనీయవని పలువురు శాఖాహార ప్రియులు వెల్లడిస్తున్నారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే చిన్న పిల్లలకు బాల్యదశ నుంచే శాఖాహారం అలవాటు చేయాలని పలువురు ఆరోగ్య ప్రియులు వెల్లడిస్తున్నారు.

రక్తదానం.. ప్రాణదానం..!



నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

జిల్లాలో వెలవెలబోతున్న రక్తనిధి కేంద్రాలు

నాలుగు నెలలుగా దాతలు కరువు

అత్యవసర పరిస్థితుల్లో

బోరుమంటున్న బాధితులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రమాద బాధితులకు ప్రాణ దాతలు కరువయ్యారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందించే రక్తనిధి కేంద్రాల్లో సరిపడా రక్తం కొరత ఏర్పడటంతో ఆ కేంద్రాలు వెలవెలబోతున్నాయి. దీంతో బాధితులు బోరుమంటున్నారు. సమాజంలో నెలకొన్న అపోహలు కారణంగా రక్తదానం చేసేందుకు అధికశాతం మంది ప్రజలు ముందుకురావడంలేదు. దీంతో జిల్లాలోని బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్తనిల్వలు అడుగంటాయి.

ఒంగోలు నగరంలో ఐదు బ్లడ్‌బ్యాంక్‌లు ఉండగా, జిల్లాలోని దర్శి, కనిగిరి, గిద్దలూరులో రక్తాన్ని భద్రపరిచే కేంద్రాలున్నాయి. వీటిలో సరిపడినంతా రక్తం లేకపోవడంతో అత్యవసర పరిస్థితిల్లో బాధితులకు కష్టాలు తప్పడంలేదు. ఒంగోలు జీజీహెచ్‌లో బ్లడ్‌బ్యాంక్ కేవలం హాస్పటల్‌లోని ఇన్‌పేషెంట్‌లకు మాత్రమే నామమాత్రపు రుసుములతో రక్తాన్ని అందిస్తుంది. రక్తాన్ని దానం చేసేవారు లేకపోవడంతో రోగుల బంధువుల నుంచి సేకరించిన అరకొర రక్తంతో కాలం వెళ్లబుచ్చుతున్నారు.

● రెడ్‌క్రాస్.. నిల్వలు అంతంతమాత్రమే

జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా సొసైటీ పేరుతో నామమాత్రపు రుసుంతో పనిచేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థలో మూడు నాలుగు నెలలుగా రక్తదాన శిబిరాలు లేకపోవడంతో నిల్వలు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఉన్న కొద్దిపాటి గ్రూపులను సిఫార్సు మేరకు ఇస్తుండడంతో సామాన్య బాధితులు బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక బిలీఫ్ బ్లడ్ బ్యాంక్, ఒంగోలు బ్లడ్ బ్యాంక్ పూర్తిగా ప్రైవేటు సంస్థలు కావడంతో కొద్దోగొప్పో రక్తాన్ని సేకరించి భద్రపరిచి అమ్మకాలు చేపడుతున్నారు. వైద్యులు మాత్రం ప్రజలలో అవగాహన లోపించడమే కారణమంటున్నారు.

● జిల్లాలో నెలకు సుమారు 1000 యూనిట్లు అవసరం

ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా ఒక్క ఒంగోలు నగర పరిధిలోనే రోజుకు పది యూనిట్ల వరకు రక్తం అవసరమవుతుందని అంచనా. ఒంగోలులోనే నెలకు 300 యూనిట్(బ్యాగ్)లు అవసరముండగా జిల్లాలో వెయ్యి యూనిట్ల వరకు ఉంటుందని తెలిపారు. వీరిలో ప్రతి నెలా తలసీమీయా, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది. రీప్లేస్‌లో వచ్చిన కొద్ది యూనిట్లలో అన్నీ పరీక్షలు నిర్వహించగా హెపటైటస్ బీ, సీ, హెచ్ఐవీ పాజిటివ్, మలేరియా, షుగర్ వంటి వ్యాధులు ఉన్నట్లయితే ఉపయోగం ఉండదు.



రక్తదానం చేస్తున్న యువకుడు

● అవగాహన లోపం

ప్రతి వ్యక్తి రక్తాన్ని దానం చేయడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులను దూరం చేసుకోవచ్చంటున్నారు. ప్రజలు రక్తాన్ని దానం చేయడం వలన నీరసించి, బలహీన పడతామేమోనని, కొత్త వ్యాధులు బయటపడతాయనే అపోహలో రక్తం దానం చేయకపోవడంతో మనిషి మరింత అనారోగ్యానికి లోనవుతారని వైద్యులు అంటున్నారు. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగినవారు ఏడాదిలో రెండుసార్లు చేయవచ్చు. నాడి 60-100 కొట్టుకొని ఉండాలి, 60 నుంచి 80 శాతం వరకు రక్త కలిగిన వారు రక్తదానం చేయవచ్చు ఈ విధంగా చేయడం ద్వారా గుండెపోటు, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, ఓబేసిటీని రాకుండా చేయవచ్చు.

అమృతమూర్తులు అమ్మానాన్నలు..!

నిరాదరణకు గురవుతున్న

వయోవృద్ధులు

పోషణ, సంక్షేమం కోసం కేంద్రం చట్టం

నేడు వయో వృద్ధుల దినోత్సవం

ఒంగోలు, కార్పొరేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమ్మానాన్న.. బిడ్డల ఉన్నతికి కారకులు. వారికి జన్మనివ్వడంతో పాటు రెక్కలు ముక్కలు చేసుకుని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తారు. తమ కాళ్లపై తాము నిలబడిన తర్వాత బిడ్డలు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరిపోతున్నారు. వృద్ధాప్యానికి చేరుకున్న తల్లిదండ్రుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న పెడధోరణి ఇటీవలకాలంలో పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లో వయోవృద్ధుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. వారికి ప్రత్యేక హక్కులను కల్పించింది. నేడు వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● వయోవృద్ధుల పోషణకు నెలకు రూ.10వేలు

తల్లిదండ్రులు, వయోవృద్ధులు పోషణ సంక్షేమం చట్టాన్ని 2007ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 60 ఏళ్ల, ఆపైన వయస్సుగల వారు ఈ చట్టం పరిధిలోకి వస్తారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వయో వృద్ధుల ఆశ్రమాల్లో చేర్పించిన వృద్ధుల సంక్షేమం కోసం కేంద్రం చట్ట సహాయం అందిస్తుంది. వృద్ధులు, తల్లిదండ్రులు తమ పిల్లలు, ఆస్తిని పొందిన బంధువుల నుంచి పోషణ కోసం భరణం అడగవచ్చు. ఇందుకోసం పోషణ ఖర్చు,ఆహారం, దుస్తులు, నివాసం, వైద్య సహాయం, చికిత్స కోసం పిల్లల ఆదాయనికి అనుగుణంగా నెకు రూ.10వేల లోపు చెల్లించాల్సి ఉంది. చట్టంలోని సెక్షన్ 4 కింద ఎవరి నుంచి పోషణ ఖర్చులు కోరుతున్నారో వారి పేర్లు, పూర్తి వివరాలు, చిరునామా పేర్కొంటూ బాధితులైన తల్లిదండ్రులు, వయోవృద్ధులు రెవెన్యూ డివిజనల్ స్థాయిలోని ట్రిబ్యూనల్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు, లేదా బంధువులు ఉంటే వారి సంపాదన స్థాయికి అనుగుణంగా ఖర్చులను కోరవచ్చు.



తల్లిదండ్రుల్లో ఆందోళన

వృత్తిపరంగా కావచ్చు, సామాజికపరంగా కావచ్చు, ఆర్థికంగా కావచ్చు, మనం ఎన్న ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాము. ఎన్నో సందర్భాలలో ఇంకెన్నో విషయాల్లో రాజీపడుతున్నాం. వృద్ధాప్యంలో ఓ తీయని మాట కోసం అల్లాడిపోతున్న తల్లిదండ్రులను మాత్రం పట్టించుకోని బిడ్డలు ఉన్నారంటే ఆశ్చరపడాల్సిన పనిలేదు. నాటి తరం ఆవేదనకు, నేటి తరం ప్రతిస్పందనకు పొంతన లేకుండా పోతుంది. ఉద్యోగాల పేరుతో విదేశాలలో వేల డాలర్ల సంపాదనే ధ్యేయంగా కొందరుండగా, ఉమ్మడి కుటుంబాల మధ్య ప్రేమ ఆప్యాయతలు సన్నగిల్లి వేర్వేరు కుటుంబాలుగా విడిపోతున్న సందర్భాల్లో తల్లిదండ్రుల మాత్రం ఒంటరిగా మిగిలిపోతున్నారు. కడుపున పుట్టిన కన్నబిడ్డలు తల్లిదండ్రులకు పట్టెడన్నం పెట్టేందుకు పోటీలు పెట్టుకుంటూ, పైసలు లెక్కిస్తున్న ఈ రోజుల్లో అనేక హృదయాలు దీన స్థితిలో కన్నీటి రోజులను వెళ్లదీస్తున్నారు.



వృద్ధురాళ్ల మాటామంతీ

డిగ్రీ అడ్మిషన్ల ఫేజ్-2 షెడ్యూల్ విడుదల

ఒంగోలు విద్య, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి ఫేజ్-2 షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు షెడ్యూల్ ప్రకటించింది. ఫేజ్ 2 అడ్మిషన్ల గడువును పొడిగించింది. విద్యార్థులు ఈ నెల 3వతేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. 4వరకు సర్టిఫికెట్ల ధ్రువీకరణకు వెసులుబాటు కల్పించారు. 6వతేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. వాటిల్లో మార్పులు, చేర్పులకు 7వ తేదీ వరకు గడువు ఇచ్చారు. 10న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో సీట్ల కేటాయిస్తారు. వారు 11నుంచి 13వతేదీ లోపు కళాశాలల్లో రిపోర్టు చేసి అడ్మిషన్ తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తు చేసే విద్యార్థులకు ఒంగోలు శ్రీ హర్షిణీ డిగ్రీ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అవకాశం కల్పించినట్లు శ్రీ హర్షిణీ విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ ఒక ప్రకటనలోతెలిపారు.

6లోపు యూడైస్‌లో కొత్త విద్యార్థుల నమోదు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులందరినీ అక్టోబరు 6వ తేదీలోపు యూడైస్‌లో నమోదు చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి కొత్త విద్యార్థికి స్టూడెంట్ మాడ్యూల్‌లో నమోదు చేయాలి. మండల స్థాయి ఐటీ బృందం తమ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి ఈప్రక్రియను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కూడా తప్పనిసరిగా తమ పాఠశాలల్లో విద్యార్థులను యూడైస్‌లో నమోదు చేయాలని పీడీ ఆదేశించారు.

10లోపు విద్యామిత్ర బ్యాగ్‌లు, షూలు మార్చాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ద్వారా పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లలో పాడైన బ్యాగులు, సైజులు సరిపోని షూలను అక్టోబరు 10లోపు మార్చాలని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థి మిత్ర కిట్ల ద్వారా విద్యార్థులకు యూనిఫారం, పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగులు, షూలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ తదితరాలు విద్యార్థులకు అందజేశారు. వీటిలో కొన్ని బ్యాగులు, పాడైన కొన్ని బూట్ల సైజులు సరిపోక ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయాన్ని క్షేత్ర స్థాయిలో డీఈవోలు, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు, మండల విద్యాధికారుల దృష్టికి కూడా వచ్చింది. దీంతో ఈ విషయాన్ని ఎస్పీడీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాడైన బ్యాగులు, షూల స్థానంలో కొత్త బ్యాగులు, షూలను సరఫరా చేయాలని సరఫరా దారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇతర జిల్లాల్లో ఎక్కడైనా అదనంగా బ్యాగులు, షూలు ఉన్న వాటిని అవసరం ఉన్న ఇతర జిల్లాలకు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. మిగిలిపోయిన విద్యార్థిమిత్ర కిట్లలోని వస్తువులను సంబంధిత మండల విద్యవనరుల కేంద్రాలకు చేర్చాలని ఎస్పీడీ ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎంత మంది, ఎన్ని కిట్లు సరఫరా అయ్యాయి, విద్యార్థులకు ఎన్ని కిట్లు పంపిణీ చేశారు. ఎన్నిపాఠశాలల్లో ఉండిపోయాయి వివరాలను వెంటనే ప్రొఫార్మా రూపంలో తెలియజేయాలని శ్రీనివాసరావు ఆదేశించారు.

డాక్టర్ల ఆందోళన.. వైద్య సేవలపై కలెక్టర్ దృష్టి

పీహెచ్‌సీల్లో పేదల చికిత్సలకు

ఆటంకాలు లేకుండా చర్యలు

ప్రత్యేకంగా వైద్యుల కేటాయింపు

కలెక్టరేట్‌లో కంట్రోలు రూము ఏర్పాటు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కలెక్టర్ రాజాబాబు ప్రత్యేకదృష్టి సారించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలకు అంతరాయం లేకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్యులను జీజీహెచ్‌ల నుంచి కమ్యూనిటీ వైద్యశాలల నుంచి డాక్టర్లను కేటాయిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు నిరంతరం కలెక్టరేట్‌లో కంట్రోలు రూమును కూడా ఏర్పాటు చేశారు. అందుకోసం 1077 టోల్‌ఫ్రీ నెంబరుతో పాటు 08592-281400 ఫోన్ నెంబర్‌ను కూడా కేటాయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు వైద్య సేవలు అందడంలో ఏమైనా సమస్యలు ఉన్నా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన వైద్యులకు ఏమైనా సమస్యలు ఉంటే ఈ కంట్రోలు రూముకు కేటాయించిన ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ కళాశాల నుంచి 50 మంది వైద్యులను కమ్యూనిటీ వైద్యశాలల నుంచి 20 మంది వైద్యులను కలెక్టర్ నియమించారు. వీరితో పాటు అనుభవం కలిగిన ఎంఎల్‌హెచ్‌పీలను వీరికి సహాయకులుగా నియమించారు. ప్రతి నియోజకవర్గంలో పర్యవేక్షణకు ఒకరిని ప్రోగ్రాం అధికారిగా నియమించడంతో పాటు ప్రతి మండల పరిధిలో ఒక 108 వాహనాన్ని అత్యవసర కేసుల నిమిత్తం అందుబాటులో ఉంచారు. హైరిస్క్, గర్భిణుల జాబితాలను ముందస్తు జాగ్రత్తల కోసం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపే విధంగా కలెక్టర్ శ్రీకారం చుట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పీజీ ఇన్‌సర్వీస్ కోటాతో పాటు పలు రకాల సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాటపట్టిన నేపథ్యంలో ప్రజలకు వైద్యసేవల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి వైద్యశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.



కమాండ్ కంట్రోల్ రూంలో సిబ్బంది

కనీస వేతనాల సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్‌గా కాకర్ల

మార్కాపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన కాకర్ల శ్రీనివాసులును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈయన ప్రస్తుతం టీడీపీ మండల పార్టీ అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో మార్కాపురం ఏఎంసీ చైర్మన్‌గా పనిచేశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డ కీలక నాయకులలో ఈయన ఒకరు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు తెలిపారు. తన శక్తివంచనలేకుండా నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.



కాకర్ల శ్రీనివాసులు

తొమ్మిదిమంది జూదరుల అరెస్టు

పొదిలి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈగలపాడు గ్రామ సమీపంలో పేకాటా శిబిరంపై దాడి చేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్.వేమన తెలిపారు. పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి 62,500 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పశ్చిమ ప్రాంతం పోలీసులపై ఎస్పీ సీరియస్

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రాంతంలో పనిచేస్తున్న కొంతమంది పోలీసు అధికారుల పనితీరు పట్ల ఎస్పీ హర్షవర్ధనరాజు అసహనం వ్యక్తం చేశారు. ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్సైలను మంగళవారం ఎస్పీ కార్యాలయానికి పిలిపించి ఎస్పీ మాట్లాడారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సివిల్ సెటిల్‌మెంట్లతోపాటు నెల మాముళ్ల వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిని ఒక్కొక్కరిని పిలిచి వారిపై ఉన్న ఆరోపణలను గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. తీరు మార్చుకోవాలని సీరియస్‌గా చెప్పి పంపించారు.

జిల్లాలో 6.9 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి మంచి వర్షం కురిసింది. మంగళవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 6.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. బేస్తవారిపేట మండలంలో 40.6 మి.మీ., కంభం 35.6, రాచర్ల 31.8, తర్లుబాడు 31.6, గిద్దలూరు 29.6, అర్ధవీడు 27.2, కొమరోలు 26.0, వెలిగండ్ల మండలంలో 10.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో ఏడెనిమిది మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

కప్పు కాఫీ..ఎంతో హ్యాపీ !

రోజూ కాఫీ తాగటం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు
మానసిక, శారీరక పనితీరు మెరుగుదల
ప్రస్తుతం అనేక రుచుల్లో లభ్యం
నేడు అంతర్జాతీయ కాఫీ దినోత్సవం



మనలో చాలా మందికి నిద్రలేవగానే గుర్తుకొచ్చేది కాఫీ. అనేక కుటుంబాలలో ఉదయాన్నే కాఫీ నోట్లో పడకపోతే ఏ పనీ చేయలేరు. ఒక్కోసారి ఉదయాన్నే ఇంటికి వచ్చే పాలప్యాకెట్ కొంచెం ఆలస్యంగా వస్తే చాలామంది చిరాకుపడిపోతుంటారు కాఫీ తాగటం ఆలస్యం అవుతుందని..! అటువంటి కాఫీకి అనేక సంవత్సరాల చరిత్ర ఉండటమే కాకుండా అనేక రకాల ఆరోగ్యప్రయోజనాలు సైతం ఉన్నాయి. కాఫీ గురించి ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు సైతం జరిగాయి. కాఫీ వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తేలింది. వాటిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించటానికి ప్రతి ఏడాది అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని గత కొన్ని సంవత్సరాలుగా జరుపుకుంటున్నారు. ప్రతి ఏడాది అక్టోబరు 1వ తేదీన అంతర్జాతీయ కాఫీ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

- ఒంగోలు కల్చరల్, (ఆంధ్రజ్యోతి)

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

కాఫీలో ఉండే కెఫీన్ నాడీ వ్యవస్థను ఉత్తేజపరిచి, శక్తి స్థాయిని పెంచటం ద్వారా మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఇక రోజు మితంగా కాఫీ తాగటం ద్వారా టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం సైతం తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అదేవిధంగా గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని సైతం కాఫీ తగ్గిస్తుంది. ఇందులో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉండటంతో శరీర కణజాలానికి ఎంతో ఉపయోగకరమని వైద్యులు చెబుతున్నారు. ఇక కాఫీ తాగనివారి కంటే రోజు ఉదయం, సాయంత్రం కాఫీ తాగే వారు సుమారు 16 సంవత్సరాలు ఎక్కువగా జీవిస్తారని సైతం పరిశోధనలు చెబుతున్నాయి. అయితే కాఫీని మితంగా తీసుకుంటే దానివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, ఎక్కువగా తీసుకోవటం వల్ల అధిక కెఫీన్ ప్రభావంతో శరీరానికి కొన్ని దుష్ప్రభావాలు కలుగుతాయని సైతం వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న కాఫీ సంస్కృతి

గతంలో మధ్య, ఎగువ తరగతి కుటుంబాల వారు ఇంట్లో తయారు చేసుకుని కాఫీ తాగుతుండేవారు. అయితే ప్రస్తుతం కాఫీకి సమాజంలో ఆదరణ బాగా పెరిగిందని చెప్పొచ్చు. ఎంతగా అంటే ఈ కాఫీ తయారీలో అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ప్రవేశించి అనేక బ్రాండ్లతో కాఫీ క్లబ్‌లు, హోటళ్లు ఏర్పాటు చేస్తున్నాయి. అంతేకాకుండా బాగా ప్రాచుర్యం పొందిన కుంభకోణం కాఫీ, చెన్నై కాఫీ వంటి సంస్థలు ఫ్రాంచైజీలు సైతం ఇస్తుండగా అనేక పట్టణాలు, నగరాలు, జాతీయ రహదారుల వెంబడి ఈ కాఫీ క్లబ్‌లు, హోటళ్లు వెలిశాయి. మన జిల్లాలో సైతం ఒంగోలు నగరంలో ప్రత్యేకంగా అనేక కాఫీ క్లబ్‌లు ఉండగా ఇక జాతీయ రహదారి వెంబడి జాతీయ కాఫీ సంస్థల ఫ్రాంచైజీలు ఉన్నాయి. కేవలం పాలు కలిపిన కాఫీ మాత్రమే కాకుండా బ్లాక్ కాఫీ, ఎస్ప్రెస్సో కాఫీ, ఫ్లాట్ వైట్, కోల్డ్ కాఫీ, టర్కిష్ కాఫీ, అమెరికానో కాఫీ వంటి అనేక రకాలు సైతం ప్రస్తుతం మన జిల్లాలో వెలిసిన కాఫీ క్లబ్‌లు, కాఫీ ఫ్రాంచైజీలలో లభ్యమవుతున్నాయి. వీటికి ఇప్పుడిప్పుడే ప్రజల నుంచి ఆదరణ వస్తున్నదని వాటి నిర్వాహకులు చెబుతున్నారు.

నేడు మద్దిపాడుకు మంత్రి స్వామి

మద్దిపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి బుధవారం మద్దిపాడు రానున్నట్లు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు, మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బీసీకాలనీలో జరిగే జీఎస్టీ అవగాహన సదస్సుకు మంత్రి స్వామితో పాటు ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ హాజరవుతారన్నారు. అలాగే పించన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాజాబాబు హాజరవుతారని వారు పేర్కొన్నారు.

నగరంలో పర్యటించిన ఎస్పీ

● భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు



అమ్మవారికి నమస్కరిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల నేపథ్యంలో నగరంలోని పలు దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ హర్షవర్ధనరాజు మంగళవారం రాత్రి పరిశీలించారు. స్థానిక బాలాజీరావుపేటలోని పోలేరమ్మ దేవాలయం, కనకదుర్గమ్మ ఆలయం, గంటాయిపాలెంలోని పార్వతమ్మ గుడి, మస్తాన్‌దర్గా సెంటర్ తదితర ప్రాంతాలలో కళారాలు ఊరేగింపు జరిగే ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు ఇచ్చారు. అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, సీఐలు విజయకృష్ణ, నాగరాజు, హజరత్తయ్య, పాండురంగరావు, సిబ్బంది ఉన్నారు.

మంగమూరు రోడ్డులో యువకుల కొట్లాట

● ముగ్గురికి గాయాలు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకుల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటన ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని జడ్పీ కాలనీకి వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక శివప్రసాద్‌కాలనీలో నివాసం ఉండే చల్లా జైవర్ధన్ తన స్నేహితుడు దండే భవిష్‌లు కలిసి బుల్లెట్ వాహనంపై మంగమూరు రోడ్డు సిగ్నల్స్ నుంచి ఇంటికి వెళుతున్నారు. అటువైపుగా లాల్‌శ్యామ్, మరో యువకుడు మోటార్‌సైకిల్‌పై వెళుతూ బూతులు తిట్టుకున్నారు. దీంతో జడ్పీకాలనీకి వెళ్ళి క్రాస్ రోడ్డు దగ్గర ఇరువురు తమ వాహనాలు ఆపి ఘర్షణకు దిగారు అంతేగాకుండా వారు తమకు చెందిన కొందరికి ఫోన్‌లు చేసి పిలిపించుకుని మీరీ కొట్లాటకు దిగారు. దీంతో జైవర్ధన్, భవిష్, లాల్‌శ్యామ్‌లు గాయపడ్డారు. పోలీసులు వచ్చిన తరువాత ఇరువర్గాల వారిని అదుపు చేశారు.

మంత్రిని కలిసిన ఎస్పీ

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాయలంలో మంత్రి స్వామిని ఎస్పీ కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను సమీక్షించారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే బీఎన్ : ఎస్పీ వి.హర్షవర్ధనరాజును సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

నూతన జీఎస్టీ విధానంతో ప్రజలకు ఆదా

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన జీఎస్టీ విధానంతో వినియోగదారులకు ఆదా చేకూరుతుందని ఎంపీడీవో తేళ్ళ రవికుమార్ సూచించారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ చదలవాడ గ్రామంలో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు కలిగే పన్ను రాయితీ ప్రయోజనాలను వివరించే కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ టి.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్, ఏపీవో డి.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక గ్రామసభలు

గాంధీ జయంతి సందర్భంగా ఈనెల 2న ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించాలని ఎంపీడీవో రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తెలిపిన 9 అజెండా అంశాలపై చర్చించి తీర్మానం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు గ్రామసభ ఏర్పాటుపై ప్రజలకు తెలిసేలా ముందస్తు ప్రచారం చేయాలని సూచించారు. గ్రామసభ ఫొటోలు యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.

పొన్నలూరులో పోలీసుల పల్లెనిద్ర

పొన్నలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు పల్లె నిద్రలు చేస్తున్నారని కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. సోమవారం రాత్రి 11:30 గంటలకు పొన్నలూరులోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని కోరారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై అనూక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి : వైసీపీ



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీసెల్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే విధానాలను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎస్సీసెల్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కొమ్మూరి కనకారావు మాదిగ మాట్లాడుతూ వైద్య విద్యను పేదలు, ఎస్సీ, ఎస్టీలకు దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని, ఈ విధానాలను ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, దుడ్డు వినోద్, గోపీచంద్, కె.నరసింహారావు, ఇశ్రాయిల్, మధు, కంభంపాటి సన్నిబాబు, ఏసుదాసు, ఎం.లూకా, దేవదానం, తేళ్ళ పుల్లారావు, రాయపాటి విల్సన్, కావూరి ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

నయన మనోహరంగా కళారాల ఉత్సవం

● ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, రవిశంకర్, మేయర్ సుజాత

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ఒంగోలు నగరానికే తలమానికంగా నిలిచే అమ్మవారి కళారాల ఉత్సవం మంగళవారం రాత్రి నయన మనోహరంగా కొనసాగింది. దసరా పండుగ ముందు రెండు రోజులు అనగా దుర్గాష్టమి, మహర్నవమి రోజులలో ఈ కళారాల ఉత్సవం జరుగుతుంది. దుర్గాష్టమి రోజైన మంగళవారం రాత్రి స్థానిక బాలాజీరావుపేట నుంచి శ్రీకనకదుర్గా అమ్మవారి కళారం, బీవీఎస్ హాల్ సెంటర్ నుంచి బాలా త్రిపురసుందరీ దేవి కళారం, అంకమ్మపాలెం నుంచి కాళికామాత కళారాలు ఊరేగింపుగా బయల్దేరి నగరంలోని పలు మార్గాల్లో కొనసాగి బుధవారం తెల్లవారుజామునకు మస్తాన్‌దర్గా సెంటర్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కళారాలను చూడటానికి వచ్చిన వేలాదిమంది ప్రజానీకం, భక్తులతో ఒంగోలు నగరంలోని పలు రహదారులు కిక్కిరిసిపోయాయి. అదేవిధంగా కళారాలను యువకులు ఉత్సాహంగా ఊరేగించగా ప్రత్యేక వాహనం ముందు తప్పెట్లు, డీజే వాయిద్యాలు, కళాకారుల వేషధారణలతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళారాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దర్ పాల్గొని ముందుగా అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక బుధవారం రాత్రి పార్వతీదేవి, నరసింహస్వామి, మహిషాసురమర్దని అమ్మవార్ల కళారాల ఉత్సవం ఉంటుంది.



కళారాలను తిలకించేందుకు వచ్చిన భక్తులు

ఘనంగా దళిత సాంస్కృతిక సాహితీ మహోత్సవం

10మంది సాహిత్య, సాంస్కృతిక యోధులకు అవార్డుల ప్రదానం ● హాజరైన చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్



సభలో పాల్గొన్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, పలువురు ప్రముఖులు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విశ్వకవి గుర్రం జాషువా మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక అంబేడ్కర్ భవన్‌లో తెలుగు దళిత ప్రజల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో దళిత సాంస్కృతిక సాహితీ మహోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా జాషువా చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు దళిత ప్రజల సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఎల్లుట్ల వరుణ్ తేజ ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం గుర్రం జాషువా తన రచనల ద్వారా ఉత్తేజపరిచారన్నారు. ఆయన రచనలు, నాటకాలు ఆనాడు సమాజాన్ని పట్టిపీడిస్తున్న అంటరానితనాన్ని ఎత్తి చూపాయని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ దళితులలో సామాజిక, సాంస్కృతిక చైతన్యం ఎంతగానో ఉన్నదని, దానిని సమాజ హితానికి ఉపయోగించేలా కార్యక్రమాలు రూపొందాలన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ దళితుల పట్ల వివక్షను రూపుమాపేందుకు సాంస్కృతిక, సాహిత్య రంగాల వారు కృషిచేయాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయబాటలో, జాషువా సిద్ధాంతాలతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నాటక రచయిత డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు, సాహితీ అనువాదకులు జీవీ.రత్నాకర్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, నూకతోటి రవికుమార్, రచయిత ఎజ్రాశాస్త్రి, బహుజన సాహితీవేత్త శ్రీనివాసగౌడ్, దళిత రచయిత్రి గంగవరపు సునీత, ఆదివాసీ సాహితీ యోధుడు ఈవీ.వెంకటేశ్వర్లు, సాహితీ సంపాదకులు కత్తి కళ్యాణ్, అల్ప సంఖ్యాక సాహితీ యోధులు షేక్ మహమ్మద్ రఫీలను నగదు పురస్కారంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాంసన్ రాకేశ్, అరుణ్ ధీరజ్, ఏసుపాదం, సతీష్, రంజిత్, ప్రణయ్, సునీల్, షఫీ, విజయ్ చంద్ర, అవినాష్, అక్షయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవానీ దయచూడమ్మా !

● ఘనంగా దుర్గాష్టమి పూజలు
● ఆలయాలకు పెద్దసంఖ్యలో భక్తులు, మహిళలు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రులు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. దసర వేడుకల్లో చివరి మూడు రోజులు అత్యంత ముఖ్యమైనవిగా భావిస్తారు. అవి అష్టమి రోజున దుర్గాష్టమి, నవమి రోజున మహర్నవమి, దశమి రోజున విజయదశమి(దసరా). మహిషాసురుడిని సంహరించటానికి దుర్గాదేవి అష్టమి రోజునే బయల్దేరి, అతనితో యుద్ధం చేసి నవమి రోజున మహిషాసురుడిని సంహరిస్తారు. ఆ మరుసటి రోజైన దశమిని విజయదశమిగా దేవతలు, ప్రజలు జరుపుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి దుర్గాష్టమి పండుగను మంగళవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని పలు అమ్మవారి దేవాలయాలలో అమ్మవారికి దుర్గాదేవి అవతారంతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఒంగోలు నగరంలో సైతం పలు దేవాలయాలలో అమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని చూసేందుకు భక్తులు ముఖ్యంగా మహిళలు పలు దేవాలయాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నగరంలోని కేశవస్వామిపేట శ్రీవిజయదుర్గాదేవి దేవస్థానం, బాలాజీరావుపేట శ్రీకనకదుర్గ, పోలేరమ్మ, మహాలక్ష్మి దేవస్థానాలు, గంటాపాలెం శ్రీపార్వతమ్మ దేవస్థానం, అంకమ్మపాలెం కాళికా అమ్మవారి దేవస్థానం, మంగమూరు రోడ్డు శ్రీగాయత్రి మందిరం, శ్రీఅచలానంద ఆశ్రమం, లాయర్‌పేట, సంతపేట సాయిబాబా మందిరాలలోని శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయం, నాగలక్ష్మి అమ్మవారి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం, కొత్తపట్నం రోడ్డులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి, బాలాత్రిపురసుందరీ దేవస్థానం మొదలైన పలు దేవాలయాలలో అమ్మవారిని దుర్గాదేవిగా విశేష అలంకరణలు చేసి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు.

ఇక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని పలు దేవాలయాలను మంగళవారం రాత్రి సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానాల ఈవోలు, నిర్వాహకులు, అర్చకులు, స్థానిక నాయకులు ఆయనకు సాదరస్వాగతం పలికారు.



గంటాపాలెంలో..



కొత్తపట్నం బస్టాండులో..



ఒంగోలులో వాసవీఅమ్మవారు..



వల్లూరమ్మతల్లి



ఒంగోలు లాయర్‌పేటలో..

దుర్గాదేవిగా వల్లూరమ్మ

టంగుటూరు (కొండపి): దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా వల్లూరులోని వల్లూరమ్మ దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో రమేష్ పర్యవేక్షించారు.

కామేపల్లిలో..

జరుగుమల్లి(కొండపి): దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కామేపల్లిలోని పోలేరమ్మ మంగళవారం దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి చీర, గాజులు సమర్పించగా అర్చకుడు శ్రీనివాసశర్మ తీర్థప్రసాదాలను అందజేశారు. ఈవో బైరాగి చౌదరి పర్యవేక్షించారు.

అమెరికా వాణిజ్య ఉన్మాదాన్ని ఎదిరించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు అమెరికా సాగిస్తున్న యుద్ధోన్మాదాన్ని, వాణిజ్య ఉన్మాదాన్ని ఎదిరించేందుకు అభివృద్ధి చెందిన దేశాల మద్దతు కూడగట్టాల్సిన అవసరం ఉందని సీఐటీయూ నేత పూనాటి అంజనేయులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో అగ్రరాజ్యంగా ఆధిపత్యం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న టారీఫ్‌లు భారతదేశ ప్రజలపై తీవ్రప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ట్రంప్ ఆంక్షలలో హెచ్1బి వీసాలకు ఫీజును ఏకంగా లక్ష డాలర్లు(రూ.88లక్షలు)కు పెంచారన్నారు. మరో వ్యవసాయ ఉత్పత్తుల దిగు మతులు అనుమతించకుటే వందశాతం టారీఫ్‌లు చెల్లించాలని ప్రకటించడం దుర్మార్గంగా ఉందన్నారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, అసిస్టెంట్ డీడీ సుజాతరావు, టి.భక్తసింగ్ రాజు, ముసలారెడ్డి, జి.రమేష్, దేవతు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లను మాగుంట కలిసి బొకేలను అందజేశారు. కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

కాగా ఎంపీ మాగుంట బుధవారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే దేవీనవరాత్రుల సందర్భంగా ఆలయాల్లో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. గురువారం ఉదయం 9.30 గంటలకు మహాత్మా గాంధీ జయంతిసందర్భంగా గాంధీరోడ్డులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

యువకుడిపై మందుబాబుల దాడి

ఒంగోలు క్రైం,సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిపై మద్యం సేవించిన వ్యక్తులు దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి 11.30 గంటలకు ఒంగోలు నగరం మంగమూరు రోడ్డు జంక్షన్‌లో జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక మిలటరీ కాలనీలో నివాసం ఉంటున్న పత్తిపాటి అమర్నాథ్ రాత్రి సమయంలో మంగమూరు రోడ్డు జంక్షన్‌లో ఓ హోటల్ వద్ద అమ్లేట్‌ల కోసం వచ్చాడు. అక్కడ కొంతమంది మద్యం తాగిన యువకులు అమర్నాథ్‌తో అనవసరంగా వివాదానికి దిగి దాడి చేశారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గం

● జనసేన నేత బాలనాగేంద్రయాదవ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా తనను అణిచివేసేందుకు కుట్రపూరితంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని జనసేన పార్టీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్ ఆరోపించారు. ఒంగోలులోని ఎంసీఏ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు కొంతమంది కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆ వీడియోల్లో వచ్చిన మాటలు తనవి కావని స్పష్టం చేశారు. మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు వచ్చిన రోజునే తనపై తప్పుడు ఆడియోను రిలీజ్ చేశారన్నారు. బాలినేని నుంచి తనను దూరం చేసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు.

7న ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంజుల

ఒంగోలు విద్య, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈనెల 7న విజయవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకురాలు చెన్నుపాటి మంజుల పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఎస్టీయూభవన్‌లో మంగళవారం జరిగిన ఫ్యాప్టో సమావేశానికి జిల్లా చైర్మన్ ఎర్రయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమల నుంచి ఉపాధ్యాయును తప్పించాలని, పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని, సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, పథకాలు అమలు చేస్తున్నా ఉపాధ్యాయులకు సంబంధించి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్యాప్టో ప్రతినిధులు కె.రఫి, మాధవరావు, ఎస్.రవి, డి.శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, చల్లా శ్రీనివాసులు, పి.శీనయ్య, కె.దేవసహాయం, బి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికాలనీలోని సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు రూరల్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం ప్రగతికాలనీలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. మంగళవారం స్థానిక ప్రగతికాలనీలో పౌరహక్కులపై అర్బన్ ఇన్‌చార్జి తహసీల్దార్ నాయబ్‌రసూల్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ కొందరు రేషన్‌కార్డులు లేక ఇబ్బందిపడుతున్నామని, ఇళ్ల స్థలాలలకు పట్టాలు ఇవ్వాలని, కాలనీకి డ్రైనేజ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ అదనపు ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు

ఒంగోలు క్రైం,సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన ఏఆర్ అదనపు ఎస్పీ కొల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఒంగోలులోని పోలీస్ కల్యాణ మండపంలో జరిగిన వీడ్కోలు సభలో ఏఎస్పీ కొల్లూరి శ్రీనివాసరావును ఎస్పీ వి.హర్షవర్ధనరాజు ఘనంగా సత్కరించారు. 34 సంవత్సరాల పాటు పోలీసుశాఖకు సేవలు అందించారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రెండు టిప్పర్లు సీజ్

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు మండలం వేంపాడు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను సోమవారం అర్ధరాత్రి జరుగుమల్లి పోలీసులు కామేపల్లి వద్ద పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. జరిమానా విధించనున్నట్లు పోలీసులు తెలిపారు.

కనకదుర్గా కరుణించమ్మా

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవార్లు మంగళవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు రాజ్యలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్ ఉత్సవ మూర్తికి అభిషేకాలు, అలంకరణ నిర్వహించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు వేదలక్ష్మి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాలు పర్యవేక్షించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ మహాచండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. జవహర్ నగర్‌లోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో విజయలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద పెద్దఎత్తున ప్రసాద పంపిణీ నిర్వహించారు.

త్రిపురాంతకం : శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి శ్రీమత్ బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో అమ్మవారు మంగళవారం మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. మహాదుర్గగా అమ్మవారు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కంభం : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ కోట సత్యమాంబ దేవి మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి 9వ రోజు మంగళవారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మార్కాపురం రూరల్ : జమ్మనపల్లి గ్రామంలోని ముద్దసానమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకణలో దర్శనమిచ్చారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



మార్కాపురంలో వేదలక్ష్మిగా రాజ్యలక్ష్మి



త్రిపురాంతకంలో మహాదుర్గ అవతారంలో అమ్మవారు

తర్లుపాడు : మండలంలోని నాగెళ్లముడుపులోని శ్రీమత్ పర్వత వర్దిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితులు గణవరపు శర్మ, దేవులపల్లి పవర్ కుమార్ శర్మ, శ్రీధర్ సుబ్రహ్మణ్యం, ఓరుగంటి శివకుమార్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కూనంపులి కుమార్ భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

గిద్దలూరు దసరా నవరాత్రుల్లో భాగంగా మంగళవారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దుర్గాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా దుర్గాష్టమి వేషధారణలతో చేసిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. రాత్రి బొమ్మ దున్నపోతును నరికి వేడుకలు నిర్వహించారు. షరాఫ్ బజారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారు కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెద్దదోర్నాల : వాసవీదేవి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలోదర్శనమిచ్చారు. పోలేరమ్మ, సాయి బాబా, శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవారు పూజలందుకున్నారు.

రాచర్ల : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మంగళవారం శ్రీ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. మండల కేంద్రమైన రాచర్ల శ్రీ పట్టాభి రామాలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వాసవీ మాతకు పట్టువస్త్రాల సమర్పణ

కొమరోలు : అమ్మ దయతో ప్రజలంతా ఆరోగ్యంగా.. ఆనందంగా ఉండాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రార్థించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, సతీమణి పుష్పలీల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అధ్యక్షుడు తుమ్మలపెంట వెంకటరమణ, పూజారి గౌరిపెద్ది హరిశర్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అశోక్‌రెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆర్యవైశ్య, యువజన, వర్తక సంఘం, కిరాణామర్చంట్ వంటి వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొమరోలు, ఇడమకల్లు సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి, బిజ్జం రవింద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాలయ్య, ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, డైరెక్టర్ తిరుమలరెడ్డి, నాయకులు పులకుర్తి వెంకటేశ్వర్లు, శ్రీనివాసచౌదరి, పార్టీ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గిద్దలూరు, కంభంలో మహిషాసుర మర్దినిగా, రాచర్లలో దుర్గాదేవిగా



పచ్చగా ఉన్న పసుపు, అరటి తోటలు

మూడు రోజులుగా వానలు

వేలాది ఎకరాలలో వరి, అరటి, పసుపు పంటలు కళకళ

కంభం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా కంభం, అర్ధవీడు మండలాలలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో వేలాది ఎకరాలలో వరి, పసుపు, అరటి పంటలు కళకళలాడుతున్నాయి. శనివారం కంభం మండలంలో 17.8 మి.మీ. అర్ధవీడు మండలంలో 18.8 మి.మీ. ఆదివారం కంభం మండలంలో 7.8మి.మీ. అర్ధవీడు మండలంలో 8.4మి.మీ. సోమవారం కంభం మండలంలో 35.6మి.మీ. అర్ధవీడు మండలంలో 27.2మి.మీ. వర్షపాతం నమోదు కావడంతో రెండు మండలాల్లో సాగు చేసిన పంటలన్నీ జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. అలాగే నల్లమల అడవుల్లో కురిసిన భారీ వర్షాలకు ఇప్పటికే చారిత్రాత్మక కంభం చెరువుకు 12 అడుగుల మేర నీరు చేరడంతోపాటు రాబోయే మూడు నెలల్లో తుఫానుల ప్రభావంతో కురిసే వర్షాల వలన కంభం చెరువు నిండుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 31.8 శాతం వర్షపాతం నమోదు

రాచర్ల : మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి 31.8 శాతం వర్షపాతం నమోదయిందని అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) షేక్ మున్వర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.

పార్టీ బలోపేతానికి కలిసి పని చేయాలి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పని చేయాలని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. మంగళవారం గిద్దలూరులో ఆయనను స్థానిక బీజేపీ నాయకులు కలిశారు. బీజేపీ ప్రకాశం జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ జేవీ నారాయణ, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, నాయకులు ఎం.పుల్లయ్య, జి.రాముడు, కె.నాగేశ్వరరావు, కోటిరెడ్డి, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఆయనను కలిసి శాలువతో, పూలమాలలతో సత్కరించారు. మధు మాట్లాడుతూ మోడి నాయకత్వంలో బిజెపిలో పని చేయడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు.

తప్పిన ప్రమాదం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని షరాఫ్ బజారులో గల వేంకటేశ్వరస్వామి దేవాలయం వీధి చివర కమిటీ ఏర్పాటు చేసిన డెకరేషన్ కటౌట్ నేలకొరిగింది. ఇది పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లపై పడింది. ఆసమయంలో ఆప్రాంతంలో ఎవరూ లేకపోవడం, గమనించిన స్థానికులు అప్రమత్తమై అధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ అధికారులు వెంటనే సరఫరాను నిలిపివేసి కటౌట్‌ను తొలగించి ప్రమాదాన్ని నివారించారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ నాగరాజు

కంభం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రి ఉత్సవాలను, అక్టోబర్ 3వ తేదీ రాత్రి జరిగే అమ్మవారి ఊరేగింపును ప్రశాంతంగా జరుపుకుందామని మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. మంగళవారం కంభం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతి సంఘ (పీస్ కమిటీ) సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఏటా కంభంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లుగా ఏసారీ అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంభం సీఐ మల్లికార్జున్, ఎస్సై నరసింహారావు, ఇరువర్గాల పెద్దలు పాల్గొన్నారు.

గిద్దలూరు మున్సిపాలిటీలో పెరిగిన వార్డులు

గిద్దలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య పెరిగాయి. ప్రస్తుతం 20 వార్డులు ఉండగా ఈ వార్డులను 27 వార్డులుగా పునర్విభజన చేశారు. వార్డుల విభజన హద్దులను వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేశారు. అక్టోబరు 6వ తేదీలోగా సలహాలు, సూచనలు అందచేయాలని కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు.

5న విగ్రహావిష్కరణ

గిద్దలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాలేజీ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘ భవన సముదాయ ఆవరణలో ఈనెల 5వ తేదీ శ్రీకృష్ణదేవరాయల వారి విగ్రహ ఆవిష్కరణ నిర్వహిస్తున్నట్లు బలిజ సేవా సంఘం అధ్యక్షుడు రంగసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఆర్‌జీఎం విద్యాసంస్థల చైర్మన్ శాంతిరాముడు, ఇంకా పలువురు ముఖ్యనాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యల పరిష్కారమే సీఐటీయూ ధ్యేయమని జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి అన్నారు. మండలంలోని రాయవరం గ్రామంలో మంగళవారం సంఘ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్మికులు కలిసి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, రూబెన్, బాలనాగయ్య, ఏడుకొండలు, నాగరాజు, నాగయ్య, శాంతి, సరస్వతి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గిద్దలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవిని వృద్ధాశ్రమానికి చిన్ని సేవాసంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో దాత శేగు సాత్విక్, చిన్ని సేవాసంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్, సంస్థ ప్రతినిధులు శేగు పద్మావతి, కటకం హనీ, వృద్ధాశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ధరలను అమలు చేయాలి

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- స్మార్ట్ బజార్‌లో ఆకస్మిక తనిఖీ



జీఎస్టీ తగ్గింపుపై ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన జీఎస్టీ తగ్గింపు ధరలకే నిత్యావసర సరకులు, ఎలక్ట్రానిక్స్, మోటార్ వస్తువులను ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వ్యాపారులకు సూచించారు. మంగళవారం గిద్దలూరు పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ బజార్‌ను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణల అమలుపై ఆయన ఆరా తీశారు. జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులు పొందిన ప్రయోజనం వాస్తవ అనుభూతిని అక్కడున్న వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. నిత్యవసర వస్తువులు పాలు, పెరుగు, పప్పుదినుసులు, నూనె, సబ్బులు, పేస్టు కొనుగోలు చేసిన వినియోగదారులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అడగ్గా 10 నుంచి 20 శాతం వరకు ధరలు తగ్గినట్లు వారు తెలిపారు. హీరో హోండా షోరూంలలో మధ్యతరగతి యువకుడు జీఎస్టీకి ముందు రూ.1.15 లక్షల కెనెటిక్ హోండా బైక్ కొనలేక సెకండ్ హ్యాండ్ బైక్ కొనుగోలు చేయాలని అనుకున్నానని, అయితే ఇప్పుడు రూ.97వేలకు అందుబాటులోకి వచ్చిందని ఆ వినియోగదారుడు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చాడు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక సంస్కరణల ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేస్తున్నారని ఆయన తెలిపారు. గత వైసీపీ పాలనలో ట్రు అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపితే ప్రజా ప్రభుత్వం ట్రు డౌన్ ద్వారా విద్యుత్ చార్జీలను తగ్గించిందని అశోక్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్ బైలడుగు బాలయ్య, గోడి ఓబులరెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్ర పట్టణంగా గిద్దలూరు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన పురపాలక పట్టణంగా గిద్దలూరును తీర్చిదిద్దడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య అన్నారు. పట్టణ శివారులోని కొండపేట రోడ్డులో గల డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ చేసే యంత్ర పరికరాలను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. డంపింగ్ యార్డులో ఉన్నటువంటి లెగసీ వేస్ట్‌ను బయోమైనింగ్, బయోరెమిడియేషన్ పద్ధతిలో జల్లిపట్టి దాని నుంచి ప్లాస్టిక్, మెటల్ వేస్ట్, గాజుగా విభజించి మిగిలిన ఆర్గానిక్ వ్యర్థాన్ని ప్రాసెస్ చేసి కంపోస్టుగా మార్చి వ్యవసాయానికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈప్రక్రియ ద్వారా డంపింగ్ యార్డు ద్వారా వచ్చే లీచీట్ వల్ల జల కాలుష్యం, మిథైల్ వంటి హానికర పదార్థాలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు పాల్గొన్నారు.



యంత్రాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

సగిలేరుకు వరద



చోళవీడు సమీపంలో ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు

- నీటి గుండాలతో అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణం మీదుగా వెళ్లే సగిలేరుకు వరద చేరుతోంది. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు సగిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కొండపేట సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న నీటిగుండాల కారణంగా చిన్నపిల్లలు ఆప్రాంతాలకు వెళ్లవద్దని, ఈతకు వెళ్లేవారు కూడా వెళ్లకుండా పోలీసులను గస్తీ ఏర్పాటు చేశారు. అర్బన్ సీఐ కె.సురేష్ ఇప్పటికే ఒక ప్రకటనలో చిన్నపిల్లలను ఆప్రాంతాలకు పంపకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్దలు కూడా ఎవరూ ఈతకు వెళ్లరాదని తెలిపారు. కెఎస్‌పల్లె, దిగువమెట్ట, ఉప్పలపాడు ప్రాంతాలలో కూడా సగిలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఈ నీటితో భూగర్భజలాలు పెరుగుతాయని ప్రజలు భావిస్తున్నారు.



చిన్నగానిపల్లి సమీపంలో రామన్న కతువకు చేరుతున్న వరద నీరు



సగిలేరువాగు వద్ద కాపలా ఉన్న పోలీసులు

రామన్న కతువకు వరద

రాచర్ల : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రామన్న కతువకు వర్షపు నీరు భారీగా చేరుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. నల్లమల అడవుల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో వర్షపు నీరు రంగనాయక స్వామి దేవస్థానంలోని గుండానికి భారీగా చేరి అదనపు నీరంతా గుండం నుంచి గుండ్లకమ్మ వాగు ద్వారా చిన్నగానిపల్లె గ్రామ సమీపంలోని రామన్న కతువకు చేరుతోంది. వరదనీరు అధికంగా చేరడంతో కతువ నిండి అలుగు పారుతూ వరద నీటితో కళకళలాడుతుంది. వర్షాల ప్రభావంతో గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చోళవీడు సమీపంలోని గుండ్లకమ్మ వాగు ద్వారా ప్రవహించే వరద నీరు అక్కపల్లి, తురిమెళ్ల గ్రామాల మీదుగా ప్రవహిస్తూ భారీ స్థాయిలో కంభం చెరువుకు చేరుతుంది.

ఎరువుల అక్రమ విక్రయాలపై చర్యలేవీ!

- అక్రమార్కులకు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు
- రికార్డులు క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం

దర్శి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్త నాలు అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకోవటంలో జాప్యం జరుగుతుంది. విజిలెన్స్ అధికారులతో పాటు వ్యవసాయాధికారులు, పోలీసు అధికారులు కొద్దిరోజుల క్రితం ముమ్మరంగా ఎరువులు, విత్తనాల దుకాణాలపై దాడులుచేసి పలుచోట్ల కేసులు నమోదు చేసిన విష యం తెలిసిందే. అనేకచోట్ల అక్రమ నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. ఆతర్వాత విచారణ ఏకారణం చేతనో మం దగిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. నమోదైన 6ఏ కేసులు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ జరుగుతుంది. ఆతర్వాత పలుచోట్ల వ్యవసాయాధికారు లు తనిఖీలు చేసిన ప్రాంతాల్లో పట్టుబడిన అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవటంలేదనే విమర్శలు వినిపి స్తున్నాయి.

దర్శి, కురిచేడు, ముండ్లమూరు మండలాల్లో అనేక షాపుల్లో వందలాది బస్తాల యూరియా అక్రమంగా ని ల్వ ఉంచగా పట్టుకున్న విషయం తెలిసిందే. పలుచో ట్ల లైసెన్సులు కూడా లేకుండా పలువురు వ్యాపారులు విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన విషయం విదితమే. అక్రమంగా ఎరువులు, విత్తనాలు నిల్వ ఉంచిన అక్ర మార్కులపై చర్యలు తీసుకోవటంలో జాప్యం చేస్తున్నా రనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులు రికార్డులు క్రమబద్ధీకరించుకునేందుకు స్థానిక అధికారు లు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వ్యవసా యశాఖ అధికారులు దాడులు చేసినప్పుడు పలు షా పుల యజమానులు నిల్వలు లేనట్లు లెక్కలు చూపిం చారు. అప్పటికే వారి వద్ద వందలాది బస్తాల యూరి యా, విత్తనాలు నిల్వలు ఉన్నట్టు పలుచోట్ల గ్రామస్థు లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్థానిక అధికారులు పరి గణలోకి తీసుకోలేదు. అక్రమార్కులు ఇతర ప్రాంతాల కు తరలించి అక్రమంగా నిల్వచేసిన ఎరువులు, విత్త నాలను అమ్ముకునేందుకు సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తర్వాత అనుకూలమైన రైతులతో వే లిముద్రలు వేయించుకొని, బిల్లులు రాసి లెక్కలు సరి చేసుకునే అవకాశాలు కల్పించారనే విమర్శలు వినిపి స్తున్నాయి. స్థానిక అధికారుల తీరుపట్ల రైతులు, ప్రజ లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల, విత్తనాల వ్యాపారులతో స్థానిక అధికారులకు ఉన్న సంబంధాల తో అక్రమార్కులు తప్పించకునే అవకాశం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. ఉన్నతాధికారులు వాస్తవాలు గుర్తించి లోతుగా దర్యాప్తు చేసినట్లయితే అన్నివిషయా లు వెల్లడయ్యే అవకాశం ఉంది.


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానా

ముండ్లమూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని ఎస్‌ఐ కె.కమలాకర్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ పీవీ హనుమంతరావు, సిబ్బంది వెంకట నారాయణ, తుపాకుల శ్రీను, కాశీరాజు పాల్గొన్నారు.

గంగాభవానీని దర్శించుకున్న సీఐ

కురిచేడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వేళ అందరూ సంయమనం పాటించాలని త్రిపురాంతకం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అసన్ సూచించారు. గంగదొనకొండ గంగాభవాని అమ్మవారి దేవస్థానాన్ని మంగళవారం సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. పండుగ సందర్భంగా ఎవరూ గొడవలకు దిగవద్దని సూచించారు. ముందుగా గంగాభవాని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సీఐ వెంట ఆలయ ధర్మకర్త వరికూటి రాంబాబు తదితరులు ఉన్నారు.

టీడీపీ నేతలకు సన్మానం

పామూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, యారవ శ్రీనివాసులును మండలంలోని కంభాలదిన్నె గ్రామానికి చెందిన ఆపార్టీ నాయకులు మంగళవారం పామూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య, మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్య, గోళ్ల బాస్కరరావు, గోళ్ల వీరాంజనేయులు, ఏలూరి వెంకటేశ్వర్లు, గోళ్ల కొండయ్య, కమ్మ ప్రసాద్, ఏలూరి మాధవరావు, వీరబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆసరా

పామూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలమేరకు పామూరుకు చెందిన షేక్ బీబీకి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.40 వేల చెక్కును టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు మంగళవారం అందజేశారు. బాధిత కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ఎమ్మెల్యే ఉగ్ర మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ గౌస్‌బాషా, ముబినా మౌలాలి, సింగనపల్లి హజీమస్తాన్ పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

దొనకొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసగించిన కేసులో నిందితుడికి పొదిలి కోర్టు 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ టి.త్యాగరాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న మండంలోని ఓగ్రామానికి చెందిన యువతిని అదే గ్రామంకు చెందిన ఎస్.కిరణ్‌కుమార్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేశాడు. ఇటీవల ఆ యువతి పెళ్లి చేసుకోమని గట్టిగా నిలదీయటంతో దాడిచేసి గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కిరణ్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి పొదిలి కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు. న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా బొమ్మనబోయిన


వెంకటేశ్వర్లుయాదవ్ (ఫైల్)

కనిగిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెండు కార్పొరేషన్‌లకు కూటమి ప్రభుత్వం డైరెక్టర్‌లను నియమించింది. రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్‌లుగా 20 మందిని నియమించింది. అందులో సీఎస్‌పురం మండలానికి చెందిన బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు యాదవ్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ పార్టీ స్థాపించిన నాటి నుంచి కొనసాగుతున్నారు. ఇటీవలవరకు టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడిగా కొనసాగారు. పార్టీ పదవుల్లో కొనసాగుతూ పార్టీకి ఎనలేని సేవలందించారు.

ప్రస్తుతం రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్‌గా నియామకం వెనుక ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఎంతో సహకారం అందించి తన ఎంపికకు కృషి చేశారని వెంకటేశ్వర్లు యాదవ్ ఈసందర్భంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జై దుర్గ.. జైజై దుర్గ

వైభవంగా సాగుతున్న నవరాత్రులు

దర్శి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవా లు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మ వారు రోజుకోరూపంలో భక్తులకు దర్శనమిస్తూ పూజ లందుకుంటున్నారు. అందులోభాగంగా స్థానిక కనక దుర్గమ్మ, పోలేరమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, దద్దాలమ్మ, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో మంగళ వారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చి పూజలం దుకున్నారు. ఆలయాలు దుర్గాష్టమి రోజున భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అమ్మవారికి సారె, గాజు లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పులిపాడు, వసువుగల్లు, పెద ఉల్లగల్లు, ఈదర గ్రామాల్లో శి వాలయాల్లో భ్రమరాంబిక అ మ్మవారిని, బొప్పుడివారిపాలెం, నూజెండ్లపల్లి గ్రామాల్లో పోలే రమ్మకు ప్రత్యేక అలంకరణ చేశారు.


దర్శి: దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


తాళ్లూరు: తూర్పుగంగవరంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

దొనకొండలో..


దొనకొండ ఆనంద ఆశ్రమంలో కనక దుర్గమ్మగా దర్శనమిచ్చిన అమ్మవారు


ముండ్లమూరు: మారెళ్ళలో మహంకాళి అలంకరణలో భ్రమరాంబికాదేవి

దొనకొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో ఈశ్వరీమహదేవి అమ్మవారు కనక దుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకు లు మణిబాబుశర్మ భక్తులకు అమ్మవారి తీర్థప్రసా దాలను అందజేశారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శరన్నవరాత్రుల వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మారెళ్ళలోని చెన్న మల్లేశ్వరస్వామి దేవాలయంలో భ్రమరాంబిక దేవిని మహాకాళి అలంకారణ చేశారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరు,

తాళ్లూరులో..

తాళ్లూరు,సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు లోని రామలింగేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కన్యకా పరమేశ్వరి ఆలయం, తూర్పు గంగవరం వాసవీమాతా దేవా లయాల్లో శరన్నవరాత్రి వేడుక లు వైభవంగా జరుగుతున్నా యి. మంగళవారం దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్త లకు దర్శనమిచ్చారు. ఆలయా ల్లో అభిషేకాలు, కుంకుమ పూ జలు, అష్టోత్తర లలితాసహస్ర నామ పూజలు, దుర్గాదేవి స్తో త్రం ఆలాపన చేశారు. భక్తులు విశేషపూజలు నిర్వహించారు. రాత్రి భక్తజన బృందంఆలపిం చిన భక్తిపాటలు అలరించాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అంద జేశారు.

కురిచేడులో..

కురిచేడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా కురిచేడు శివాలయంలోని జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు మంగళవారం దుర్గాదేవి గా దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకు లు జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసా దాలు స్వీకరించారు.

భైరవకోనలో..

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ని భైరవకోనలో శరన్నవరాత్రి వేడుకలను ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యాంసుందరరాజు, ఈవో డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా మంగళవారం అమ్మ వారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చా రు. అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చండీ హో మాలు నిర్వహించారు. చండీ హోమం కార్యక్రమాల్లో పలువురు అఘోరీలు పాల్గొని దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా మహాచండీయాగం

కనిగిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కేటీఆర్ స్కూల్ ప్రాంగణంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో విశరన్నవరాత్రి ఉత్సవా ల్లో భాగంగా మంగళవారం దుర్గా సప్తశతి చండీయా గం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారు చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిక ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చండీహోమం నిర్వహించారు. భక్తులకు అన్నసం తర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కుందురు తిరుపతిరెడ్డి, శారదా దంపతులు, దేవస్థానం కమిటీ కార్యదర్శి కొప్పరపు సత్యాలు, కోశా ధికారి ఉప్పాల నరసింహారావు, తదితరులు పా ల్గొన్నారు.


కనిగిరి: చండీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

జూదరుల అరెస్ట్

పీసీపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పీసీపల్లిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై కోటయ్య తె లిపిన వివరాల మేరకు.. స్థానిక సచివాలయం సమీపంలో పేకాట ఆడుతు న్నారని సమాచారం అందింది. అందిన సమాచారం మేరకు ఎస్సై తన సి బ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లగా జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు అక్కడ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని రూ.19,040 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోటయ్య తెలిపారు.

రేషన్ దుకాణంలో తనిఖీలు

పీసీపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పీసీపల్లిలో రేషన్ దుకాణాన్ని మంగళ వారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈతనిఖీల్లో రి కార్డుల ప్రకారం నిల్వ ఉండాల్సిన రేషన్‌బియ్యంలో రెండు క్వింటాళ్లు తక్కువగా ఉండడాన్ని గుర్తించిన అధికారులు సంబంధిత డీలర్‌పై 6ఏ కేసు నమోదుచే శారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కేఆర్ భూపతి తెలిపిన వివరాల మేరకు.. పీసీపల్లి లో 0840013 నెంబరుగల రేషన్ దుకాణం నుంచి బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారని అధికారులకు సమాచారం అందడంతో తనిఖీ చేశారు. ఈతనిఖీల్లో రికార్డుల ప్రకారం 7,775కేజీల రేషన్ బియ్యం నిల్వలు ఉండాల్సి ఉండగా 7,7575 కేజీలు ఉన్నాయి. 200కేజీ(2క్వింటా)లు బియ్యం తక్కువగా ఉండటాన్ని గుర్తించి న అధికారులు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేస్తున్నట్లు డీటీ భూపతి తెలిపారు. దుకాణంలో ఉన్న నిల్వలను కమ్మవారిపల్లి డీలర్‌కు అప్పజెప్పారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

కురిచేడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వినుకొండ నుంచి పొదిలికి వెళ తున్న ఆర్టీసీ బస్సులో పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గుర య్యారు. మంగళవారం మధ్యా హ్నం వినుకొండ నుంచి పొదిలికి వెళుతున్న బస్సు కురిచేడు మండ లం బోదనంపాడు గ్రామం వద్దకు చేరుకునే సరికి బస్సు రేడియేటర్ నుంచి పొగలు బయటకు వచ్చా యి. పొగలు గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును ఆపి ప్రయాణి కులను అప్రమత్తం చేసి క్రిందకు దింపాడు.

ఆసమయంలో 30 మందికి పైగా ప్రయాణికులు బస్సులో ఉ న్నట్లు సమాచారం. ఎవరికి ఎటు వంటి ప్రమాదం జరుగకపోవడం తో అందరూ ఊపిరి పీల్చుక న్నారు.

దస్తావేజులు పోయినవి

శ్రీమతి దొడ్డి భాగ్యమ్మ, భర్త: హనుమంతారెడ్డి కి సంబంధించిన ఆస్తి డాక్యుమెంట్ 3443 / 2020 నెంబరు గల ఒరిజినల్ దస్తావేజు 26-09-2025 తేదీన తిమ్మాయిపాలెం గ్రామం నుండి దరిశికి జిరాక్స్ నిమిత్తం తీసుకొని పోతుండగా మార్గమధ్యలో పోయినది వెతికినను దొరకలేదు. దస్తావేజు దొరికిన వారు దయచేసి నాకు అందజేయవలసినదిగా మనవి.

చిరునామా:
దొడ్డి భాగ్యమ్మ, భర్త: హనుమంతారెడ్డి
తిమ్మాయిపాలెం (గ్రామం), పులిపాడు (పోస్ట్), దరిశి (మండలం), ప్రకాశం జిల్లా, ఏ.పి. సెల్: 98481 53486.

సీఎం సహాయనిధి పేదలకు వరం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేద కుటుంబాలకు వరమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరా వతి ప్రాంగణంలో మంగళవారం 62 మంది లబ్ధిదా రులకు రూ.41.32లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదకుటుంబా లకు చెందినవారు అనారోగ్యం పాలైతే ఎంత ఇబ్బం దులు పడతారో తనకు తెలుసునన్నారు. ఇలాంటి వారు కార్పొరేట్ వైద్యం చేయించుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు. అందుకోసం ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కాంక్షించి వైద్య చికిత్స కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే వీలు కల్పించం దన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వందలాది మందికి కనిగిరి నియోజకవర్గంలో సీఎం సహాయనిధి ద్వారా వైద్యఖర్చులను అందజేసినట్టు చెప్పారు. ప్రజల పట్ల కూటమి ప్రభు త్వానికి ఉన్న చిత్తశుద్ధిని గమనించాల న్నారు.

ప్రతి కుటుంబం ఆనందంగా ఉండా లన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. వైద్య చికిత్స పొందినవారు వైద్యుల సలహా లను పాటించి అనారోగ్యం నుంచి బయటపడి దసరా పండుగను సంతో షంగా జరుపుకోవాలన్నారు. లబ్ధిదా రుల కుటుంబాలకు దసరా శుభా కాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్య క్షుడు షేక్ ఫిరోజ్, మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, హెచ్‌ఎం పాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

- మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమో హన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ కార్యాలయం లో వార్డుల విభజనవారీ వివరాలను తెలిపే మ్యాప్‌ను సిద్ధంచేసి మంగళవారం ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 20 వార్డులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 28 వార్డులుగా ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. కొత్త ప్రతిపాదిత వార్డుల విభజనకు సంబంధించి పూర్తి వివరాలను ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల నోటీసు బోర్డులలో సోమవారం ప్రదర్శించినట్టు చెప్పారు. 28 వార్డుల పునర్విభ జనకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలను ఉన్నట్లయితే ఏడురోజులలోగా సలహాలు, సూచనలు, అభ్యంతరాలను తెలియ జేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీవో సువర్ణకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


వార్డుల పునర్విభజన మ్యాప్‌ను ప్రదర్శించిన మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవింగ్ లో పోలీసు ఆంక్షలు పాటిస్తే ప్రాణాపాయం నుంచి బయ టపడవచ్చని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. స్థా నిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం రాత్రి యువ తకు, మైనర్లకు ట్రాఫిక్ ఆంక్షలపై, వాహన డ్రైవింగ్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపటం నేర మన్నారు. అదేసమయంలో మైనర్లు వాహనాలు నడిపేం దుకు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు బాధ్యులవుతారని హెచ్చరించారు. యువత బైక్‌పై ముగ్గురు, నలుగురు కూడా వెళ్తున్నారని అన్నారు. అలాంటి వాహనాలను ఆపి కేసులు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదే శాలతో మద్యం సేవించి, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ నడిపే వారిపై కేసులు నమోదు చేసి 110 బైక్‌లను సీజ్ చేసినట్టు చెప్పారు. వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా ఐఎస్‌ఐ మార్కు ఉన్న హెల్మెట్‌ను మాత్రమే వాడాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్‌ఐ టి. శ్రీరాం తది తరులు పాల్గొన్నారు.



● పెసర్లంకను చుట్టుముట్టిన వరద నీరు

పింఛను పండుగ!

- పంపిణీకి సర్వం సిద్ధం
- దివ్యాంగుల పింఛన్లలో తొలగింపు లేదు



బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ముందే.. పింఛన్ల పండగొచ్చింది. జిల్లాలోని పింఛనుదారులందరికీ ఒకటో తేదీనే పింఛన్లు అందజేయడానికి గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి మూడు జిల్లాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పింఛను నగదు మొత్తాన్ని ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ఖాతాలో జమ చేసింది. మంగళవారం సాయంత్రానికే సచివాలయ సిబ్బంది నగదు డ్రా చేసి.. పంపిణీ సిద్ధంగా ఉంచుకున్నారు. బుధవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు.

● తొలి రోజే 95 శాతం

గుంటూరు జిల్లాలో 2,54,290, పల్నాడు జిల్లాలో 2,73,150, బాపట్ల జిల్లాలో 2,27411 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరందరికీ వలంటీర్లు లేకపోయినప్పటికీ తొలిరోజే పింఛన్లు అందజేస్తున్నారు. మూడు జిల్లాల్లో సచివాలయ సిబ్బంది తొలి రోజునే 95 శాతం పింఛన్లు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛనుదారులు అందరికీ దసరా ముందురోజే పింఛను నగదు అందనుంది. ప్రతి నెలా ఒకటవ తేదీ పండగ, ఆదివారం, సెలవు దినం ఉంటే ఒక రోజు ముందుగానే పింఛన్ల నగదును ప్రభుత్వం అందజేస్తోంది. గురువారం దసరా పండుగ కావడంతో ముందు రోజు లబ్ధిదారులకు పింఛను నగదు అందనుంది.

● దివ్యాంగులకు యథాతథం

బోగస్ దివ్యాంగ పింఛన్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10,279 మందిని అనర్హులుగా గుర్తించింది. వీరిలో కొంతమంది అర్హులు కూడా అనర్హత బారిన పడడంతో గత నెల ఆందోళన కొనసాగింది. ఈ నేపథ్యంలో వారికి కూడా కిందటి నెల యథాతదంగా పింఛన్లు అందజేశారు. ఈ నెల కూడా వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వారికి కూడా పింఛన్లు అందజేయనున్నారు.

● అందరికీ పింఛన్లు: డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి

ప్రతి లబ్ధిదారునికి ఒకటో తేదీనే పింఛన్ను అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఆ రోజు ఎవరైనా అందుకోలేని పక్షంలో ఆందోళన పడాల్సిన పనిలేదు. వారికి మూడో తేదీ నుంచి యథావిధిగా పింఛన్లు అందజేస్తాం. దివ్యాంగుల పింఛన్లలో ఎలాంటి తొలగింపు లేదు. వారికి కూడా ఈనెల పింఛన్లు అందజేస్తున్నాం.

వీడని ముంపు

- జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు
- ఒక అడుగు వెనక్కు... రెండడుగులు ముందుకు
- వరద తగ్గినట్టే తగ్గి ఇంతలోనే పెరుగుతూ
- చాలా లంకలకు రాకపోకలు లేవ్
- అత్యవసర సేవల కోసం పడవలు ఏర్పాటు
- వాణిజ్య పంటలు, రొయ్యల చెరువులకు తీరని నష్టం



కొల్లూరు వరద నీటిలో ఉన్న ఇటుక బట్టీలు



వరద నీటిలో మునిగిపోయిన అరటి తోట



అరవింద వారధి వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



వరదనీటిలో మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయం



వరదనీటిలోనే అమ్మవారికి పూజలు



● సుగ్గునలంక చప్టాపై వరద ప్రవాహం

మూడు రోజులుగా చుట్టుముట్టిన వరద ఒక అడుగు వెనక్కు వెళితే, ఇంతలోనే రెండడుగులు ముందుకు చొచ్చుకొస్తోంది. తగ్గిందని ఊపిరి పీల్చుకునేలోపే మళ్లీ వరద పెరిగిపోతోంది. లంక గ్రామాలపై ఉగ్రరూపం చూపిన కృష్ణమ్మ శాంతించటంలేదు. దీంతో కృష్ణా తీరంలోని గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. రోడ్లపైకి కూడా వరద నీరు చేరటంతో రాకపోకలకు ఇంకా ఆటంకాలు తప్పటంలేదు. దీంతో ఏ గ్రామంలోనివారు ఆ గ్రామంలోనే చిక్కుకుపోయారు. అధికారులు సురక్షిత ప్రాంతాలకు రావాలని పలుమార్లు హెచ్చరికలు చేసినా పశువులను వదిలి బయటకు రావటానికి ఎవరూ ఇష్టపడటంలేదు. అయితే కొన్ని గ్రామాల్లో పరిస్థితి విషమించే వాతావరణం ఉండటంతో ఆ గ్రామాలకు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి, 500 మందివరకు రెండు గ్రామాలనుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. - ఆంధ్రజ్యోతి, బాపట్ల



● పెనుమూడి వద్ద వరదను పరిశీలిస్తున్న మంత్రి అనగాని



● పునరావాస కేంద్రంలో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్



వరదనీటిలోనే పెనుమూడి పల్లెపాలెం

గుంతల రోడ్డుకి మోక్షం

గుంతల రోడ్డుకి మరమ్మతులు చేశారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'అధ్వానపు రహదారితో ప్రజల అవస్థలు' అన్న కథనానికి అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన రోడ్డుకు కంకర తోలించి.. సమస్య తీర్చడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పర్చూరులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో .. ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న ఈ రోడ్డు గోతులయమంగా మారింది. ఓ పక్క గుంతలు, మరోవైపు వర్షపు నీరు చేరి అస్తవ్యస్తంగా మారింది.

-పర్చూరు,(ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గుంతలు మయం అయిన రోడ్డుకు మరమ్మత్తులు చేసిన దృశ్యం



వ్యవసాయ వర్సిటీకి మాయని మచ్చ!

- అక్రమాలను నిగ్గుతేల్చేందుకు చర్యలు
- విచారణాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఢిల్లీరావు
- త్వరగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు
- ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ చరిత్రలో తొలిసారి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న అక్రమాలను నిగ్గ తేల్చేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సీనియర్ ఐఏఎస్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావును విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం విడుదలైన ఈ ఉత్తర్వుల్లో విచారణ త్వరగా ముగించి నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్, కర్నూలు జిల్లాకు చెందిన అడ్వకేట్.. ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మిపై చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ జరగనుంది. ఇన్‌చార్జి వీసీపై వచ్చిన అవినీతి ఆరోపణలు, బెదిరింపుల అంశాలపై విచారణ జరిపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మసక బారిన ప్రతిష్ట

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాలు, రాజకీయాల వల్ల ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రతిష్ట క్రమేపీ మసక బారుతోంది. విశ్వ విద్యాలయం చరిత్రలో ఏనాడూ ఇలా సీనియర్ ఐఏఎస్‌తో విచారణ జరిగిన సందర్భం లేదు. మొట్ట మొదటి సారి భారీ విచారణకు ప్రభుత్వం ఉపక్రమించడం చర్చనీయాంశంగా మారింది. ఈ మధ్య **(మిగతా 4వ పేజీలో)**


చట్టానికి పాతర..

యూనివర్సిటీ చట్టంలో ఫైనాన్స్ కమిటీ (ఆర్థిక కమిటీ) లేకుండా నిధులు డ్రా చేయకూడదని స్పష్టంగా ఉంది. యూనివర్సిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే రూ.వందల కోట్ల నిధుల వినియోగం అంతా కూడా ఫైనాన్స్ కమిటీ కనుసన్నల్లోనే జరగాలి. గడచిన రెండేళ్ల నుంచి అలాంటి కమిటీ లేకుండానే నిధులు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు ఇంత వరకు ఫైనాన్స్ కమిటీ ఏర్పాటు చేయక పోవడంపైనే చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యూనివర్సిటీ చట్టం ప్రకారం ఖచ్చితంగా ఆరుగురు సభ్యులు ఉంటేనే పాలక మండలి సమావేశం నిర్వహించాలి. కానీ ఐదుగురు సభ్యులతోనే మమ అనిపించారు.

ఫ్యాక్టరీ భూములపై ప్రైవేట్ కన్ను..?

1 భూమి కొనుగోలుకు ఓ మహిళ దరఖాస్తు
1 నామమాత్రపు ధరకు ఇవ్వాలని వినతి
1 చట్ట వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోమని సీఎస్ సమాధానం

వేమూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూతపడ్డ జంపని షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 77 ఎకరాల భూమిపై ప్రైవేట్ వ్యక్తుల కన్ను పడింది. 47 ఎకరాల భూమిని నామమాత్రపు ధరకు ఇవ్వాలంటూ ఓ మహిళ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్‌లో మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన తెన్నేటి రమ్య.. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి ఇవ్వాలని బాపట్ల కలెక్టర్, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాసింది. 500 మందికి జీవనోపాధి కల్పిస్తానని అందుకోసం షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో సర్వే నంబరు 197/2 నుంచి 217 వరకు ఉన్న 42 ఎకరాల భూమిని కేటాయించాలని కోరింది. ఈ వివరాలు బయటకు రావడంతో రైతులు, ఉద్యోగులు, స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగులకు రూ.11 కోట్లు, రైతులకు రూ.12 కోట్లు, అప్పులు రూ.150 కోట్లు.. రైతులకు చెల్లించాల్సిన నాన్ రిఫండబుల్ డిపాజిట్లు బకాయి చెల్లించకుండానే భూములను చట్టానికి వ్యతిరేకంగా ఎలా అమ్ముతారని ప్రశ్నిస్తున్నారు. ఈ బకాయి చెల్లింపు విధానం అమలు చేసేందుకే ప్రభుత్వం లిక్విడేటర్‌ను నియమించడం జరిగింది. భూమి అమ్మి అప్పులు తీరే పరిస్థితి కనపడని కారణంగా బ్యాంకులతో చర్చించిన వన్ టైం సెటిల్‌మెంట్ విధానంలో బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం స్వయంగా న్యాయాధిపతులతో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ తరుణంలో సదరు మహిళ ప్రభుత్వానికి లేఖ రాస్తూ.. కొంత భూమిని నామమాత్రపు ధరకు తనకు విక్రయించాలని కోరడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ లేఖపై ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ.. చట్టానికి వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకోమని సమాధానమిచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మహిళ కోరిక మేరకు ప్రభుత్వం అనుకూలంగా స్పందిస్తే ప్రజా వ్యతిరేక ఉద్యమం కొనసాగే అవకాశాలు ఉన్నాయి.



మూతపడ్డ జంపని షుగర్ ఫ్యాక్టరీ

రైతు పక్షంగా ఎమ్మెల్యే

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాత్రం రైతు పక్షంగానే ఫ్యాక్టరీ స్థలంలో వ్యవసాయ ఆధారితమైన కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. ఈ విషయాన్ని ప్రతి సమావేశంలోనూ ఆయన ప్రజల సమక్షంలో బాహాటంగా ప్రకటిస్తున్నారు. అనేక మంది పెద్దలు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ ఎమ్మెల్యే మాత్రం రైతు పక్షపాతిగానే వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రితో చర్చించి ఎలాగైనా ఫ్యాక్టరీ స్థలంలో రైతులకు సంబంధించిన కర్మగారాన్నే ఏర్పాటు చేయాలని పట్టుదలతో ఉన్నారు. ఇందుకు రైతులు, ప్రజలు, ఉద్యోగులు కూడా తమ సంఘీభావాన్ని తెలుపుతున్నారు.

శిక్షణ కేంద్రాలు ఇవే..

1 నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజి, బూరనపేట ప్రగతి భవన్‌లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

1 వినుకొండ సమీపంలోని వివేకానంద బీఈడీ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ (ఉర్దూ, ఇంగ్లిష్), ఫిజిక్స్, గణితం అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు.

1 నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజ్ వైశ్య భవన్‌లో(రావిపాడు రోడ్డు) సెకండరీ గ్రేడ్ టీచర్స్ (తెలుగు, ఉర్దూ మీడియం) అభ్యర్థులకు శిక్షణ తరగతులుంటాయి.

1 ఫిజికల్ ఎడ్యుకేషన్, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ అభ్యర్థులకు గుంటూరు నగరంలోని సెయింట్ జోసెఫ్ బీఈడీ కళాశాల (సాంబశివపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డు)లో శిక్షణ ఇస్తారు.

1 సెకండరీ గ్రేడ్ టీచర్లకు నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురు (పాత ఎన్‌బీటీ ఎన్.టి.ఆర్ కాలేజ్) శిక్షణ అందిస్తారు.

కొత్త ఉపాధ్యాయులకు..

ఐదు చోట్ల శిక్షణ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఐదు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జోన్-3 పరిధిలో 1,600 అభ్యర్థులు ఉపాధ్యాయులగా ఎంపికయ్యారు. వారికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది. పాఠశాలలో వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు అవసరమైన ప్రాథమిక శిక్షణను విద్యాశాఖ అందించనుంది.

తరగతులు ఇలా..

డీఎస్సీ కన్వీనర్ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఇప్పటికే అధ్యాపకులను సిద్ధం చేశారు. తొలుత ప్రాథమిక శిక్షణ అందిస్తారు. అనంతరం విద్యా బోధనలో ప్రావీణ్యం, విద్యాశాఖ విధివిధానాలు, చట్టాలు, పిల్లలతో

శిక్షణ అంశాలను విడుదల చేసిన విద్యాశాఖ

బాధ్యతాయుత ప్రవర్తన, కేంద్ర, రాష్ట్ర విద్యా విధానాలు, విద్యాభివృద్ధి పథకాలు, పాఠ్య ప్రణాళిక, మూల్యాంకనం, సృజనాత్మకత ఆకలింపు, విద్యా బోధనలో సాంకేతికత తదితర అంశాల్లో నూతన ఉపాధ్యాయుల శిక్షణ ఇస్తారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగానికి ఎంపికైన ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణకు హాజరు కావాల్సిందేనని, ఎవరికి ఇందులో మినహాయింపు లేదని డీఈఓ సీవీ రేణుక స్పష్టం చేశారు.



మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న కలెక్టర్ అన్సారియా

చిత్రజ్యోతి

SINCE 1965

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వర రావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగి మణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.



వ్యవసాయ వర్సిటీకి మాయని మచ్చ!

(1వ పేజీ తరువాయి)

విడుదలైన జాతీయస్థాయి విశ్వ విద్యాలయాల ర్యాంకుల్లో కూడా ఎన్‌జీ రంగా యూనివర్సిటీ అట్టడుగు స్థాయికి చేరింది. లబ్ద ప్రతిష్ఠులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు యూనివర్సిటీలో చాలా మంది ఉన్నప్పటికీ పరిశోధనలకు సంబంధించిన అంశాలపై ముందరి కాళ్లకు బంధనాలువేస్తున్న పరిస్థితి అక్కడ నెలకొన్నట్లు తెలుస్తోంది.

చెల్లని నిర్ణయాలు

వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పనిచేసి పదవీ విరమణ పొందిన కొందరు శాస్త్రవేత్తలు ఈ మధ్య కాలం లో సీఎంఓలో ఒక ఫిర్యాదు అందజేశారు. కోరం లేకుండా తీసుకున్న ప్రతి నిర్ణయం చట్ట విరుద్ధమని, వాటి పై సమీక్ష నిర్వహించాలని అందులో కోరారు. ఐదుగురు సభ్యులతో మాత్రమే నిర్వహించిన పాలక మండలి సమావేశంలో ప్రమోషన్లు, బదిలీలు, నియామకాలు, రూ.1.25 కోట్లతో కార్ల కొనుగోలు వంటి కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. అవి చెల్లుబాటు కావన్నది విశ్రాంత శాస్త్రవేత్తల వాదన.

పాలక మండలి సభ్యులు ఉన్నా

గత ప్రభుత్వం వ్యవసాయ విశ్వ విద్యాలయానికి పాలక వర్గం నియమించింది. వారిలో ఎక్కువ మంది ప్రభుత్వం మారిన తర్వాత రాజీనామా చేశారు. ముగ్గురు మాత్రం ఈ రోజుకీ రాజీనామా చేయలేదు. పాలక మండలి సమావేశం ఏర్పాటు చేస్తే రిజిస్ట్రార్ వారికి తగిన సమాచారం ఇవ్వాలి. కానీ ఒక్క సమావేశానికి కూడా వారికి ఆహ్వానం పంపలేదని తెలుస్తోంది.

నేడు డ్రోన్ పైలెట్ శిక్షణ కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా డ్రోన్‌శిక్షణా కేంద్రం

ఇంకొల్లు,సెప్టెంబరు 30,(ఆంధ్రజ్యోతి) : భారత పౌరవిమానయానశాఖ అనుమతితో డ్రాన్‌ల్యాబ్ టెక్నాలజీస్, అహ్మదాబాద్, మారుతి ఐటీఐ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇంకొల్లులో బుధవారం సాయంత్రం 4 గంటలకు డ్రోన్ శిక్షణా కేంద్రాన్ని (రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్) ప్రారంభించనున్నారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రారంభించనున్నట్లు మారుతీ ఐటీఐ ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. అన్నదాత మణి, ఆంధ్రరాష్ట్ర ఉపాధి, శిక్షణాశాఖ జేడీఏ ఎస్.సత్యనారాయణ, ఆర్‌డిఏ నాగవర్ధనరాజులు కార్యక్రమానికి హాజరుకానున్నట్లు తెలిపారు.

మహాపాపం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చినగంజాం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో తిరుమల తిరుపతిలో జరిగిన మహా అపచారానికి నిరసనగా మంగళవారం టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మహాపాపం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్‌లు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాంఅజాద్, టీ.జయరావు, కొండ్రగుంట శ్రీహరి, సందు శ్రీనివాసరావు, నక్కల వీరరాఘవులు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, వడ్లమూడి సత్యనారాయణ, ధర్మవరపు ఏసునారయణ, ఎం.సత్యనారాయణ, షేక్ జిలాని, మాచవరపు రామాంజనేయులు, జి.నరసింహారావు, ఎం.లక్ష్మయ్య, ధనరాజ్, రామాంజనేయులురెడ్డి, ఉదయ్‌భాస్కరరెడ్డిలు పాల్గొన్నారు.

మలిసంధ్యలో మరో మజిలీకి

- ఆశ్రమాల్లోనే పండుటాకులకు ఆదరణ
- ఏటా పెరుగుతున్న నిస్సహాయ వృద్ధుల సంఖ్య
- నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

చీరాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మనిషి జీవితంలో బాల్యం, యవ్వనం, నడివయస్సు, తర్వాత వృద్ధాప్యం ఇలా ఒక్కో మజిలీలో ఒక్కో అనుభవాన్ని , ఒక్కో భావోద్వేగాన్ని తమలో ఇముడ్చుకుంటూ చివరి మజిలీవైపు సాగుతుంటారు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో ఉన్న వారికి, తమవారు అనుకున్న వారి పలకరింపులే కొండత ధైర్యాన్ని ఇస్తాయి. అయితే నేటి ఆధునికయుగంలో మనుషులు యాంత్రిక జీవనంలో తలమునకలవుతున్నారు. సంపాదనే లక్ష్యంగా దేశ, విదేశాలకు పరుగులు తీస్తున్నారు. కనీ,పెంచిన తల్లిదండ్రులకు దూరమవుతున్నారు. దీంతో బంధాలు, బంధుత్వాలు ఎండమావుల వలే అలా ఊహల్లోనే ఉంటున్నాయి. వయోభారంలో ఉన్న తల్లిదండ్రులకు వృద్ధాశ్రమాలే మరోమజిలీగా మిగులుతున్నాయి. దీంతో ఇటీవల కాలంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతోంది. అనాథల్లా ఉన్న వృద్ధులకు ఆశ్రమాలు నీడ నివ్వడం ఒకింత మంచిదే అయినా, అందరూ ఉండి ఆశ్రమాల్లో చేర్చడం బాధాకరమని విశ్లేషకులు అంటున్నారు.

ఆశ్రమాల్లోనూ సాంత్వన

అయితే కుటుంబ సభ్యులకు భారమో లేక తప్పకో ఆశ్రమాల్లో చేరిన వారికి ఇక్కడ కొంతమేరకు సాంత్వన ఉంటుందనే చెప్పాలి. విధి వారిని ఆశ్రమాలకు పరిమితం చేస్తుంటే నిర్వాహకులు వారికి కల్పించే ఆదరణ, అంతా ఒకరి బాధలు ఒకరికి చెప్పుకుని దగ్గరవుతున్నారు. ఈ క్రమంలోనే అందరూ కలిసి భోజనం చేయడం, మంచిగా ముచ్చట్లు చెప్పుకుంటూ, ఆ పాత మధురాలు చిత్రాలను టీవీల ద్వారా వీక్షిస్తు ఆనందిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబాలకు దూర మైన వారికి ఆశ్రమాలు ఉపయోగకరమనే చెప్పాలి. చీరాల పరిధిలో సుమారు 5 ఆశ్రమాలు ఉండగా అన్నింట్లో కలుపుకుని సుమారు 300 మంది వరకు వృద్ధులు కాలాన్ని గడుపుతున్నారు. వీరిలో కొందరు కుటుంబం సభ్యుల నుండి నెలవారీ రుసుము, మరి కొందరు దాతల సహకారంతో కాలాన్ని గడుపుతున్నారు.



వృద్ధాశ్రమంలోని వృద్ధులు

ఒంటరిగా ఉండలేక...



భర్త సుమారు 25 సంవత్సరముల క్రితం మృతిచెందారు. ముగ్గురు సంతానం. వారికి పెళ్లిళ్లు చేశాను. ప్రస్తుతం నా ఆలనా పాలనా చూసేవారు లేక ఆశ్రమంలో ఉంటున్నాను. ఇక్కడ అందరితో ఆనందంగా ఉంది. అయితే కుటుంబ సభ్యులు తీసుకువెళితే ఇంటికి వెళ్లాలని ఉంది.

- అవ్వారు కోటేశ్వరమ్మ, చీరాల

చూసేవాళ్లు లేక : సజ్జా నాగేశ్వరరావు, వేటపాలెం



ఒకప్పుడు బాగా బతికాను. ఇద్దరు కుమారులు విధి రాతతో చనిపోయారు. భార్యతో వయోప్రాయం కారణంగా ఇబ్బందులు పడ్డాను. దీంతో బంధువులు ఆమెను ఒకచోట, నన్నొక చోట ఆశ్రమాల్లో చేర్పించారు. ఇక్కడ చాలా బాగా చూస్తున్నారు. కుటుంబంలో పరిస్థితి లేకపోయిన ఆశ్రమం ఆనందాన్నిచ్చింది.

దాతల సహకారంతో 30 ఏళ్లుగా నిర్వహణ

వయోభారంలోలో ఉన్నవారికి సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాను. దాదాపుగా 30 ఏళ్ల క్రితం మా నాన్న చేజెర్ల కోటయ్య స్థాపించిన నాటి నుంచి ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాము. కొంత మంది కుటుంబ సభ్యుల నుంచి కొంత సహకారం ఉంటుంది. అలాగే దాతలు సహకారంతోనూ చక్కగా నిర్వర్తిస్తున్నాం. ఇతర జిల్లాల నుండి కూడా వచ్చి ఇక్కడ చేరుతున్నారు. ఎవరికైనా సేవలు కావాల్సి ఉంటే 90594 03603 సంప్రదించవచ్చు.

- పునీత్‌కుమార్, ఆశ్రమ నిర్వాహకుడు



రహదారి మరమ్మతులు చేయాలని నిరసన

- గ్రానైట్ లారీలను అడ్డగింత

బల్లికురవ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డును బాగు చేశాకే లారీ లు తిప్పాలని నక్కబొక్కలపాడు గ్రామస్థులు మంగళవారం రాత్రి ఆందోళనకు దిగారు. మండల పరిధిలోని బల్లికువ - మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వాన స్థితికి చేరి దుమ్ము ధూళి వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని నక్కబొక్కలపాడు గ్రామస్థులు మంగళవారం రాత్రి గ్రానైట్ లారీలను అడ్డుకున్నారు. ఎంతో కాలం నుంచి ఈ రోడ్డుపై మోకాటి లోతు గుంతలు పడి అధ్వానంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు నక్కబొక్కలపాడు గ్రామం మీదుగా వెళ్తుండడంతో దుమ్ము అధికంగా వచ్చి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్థులు గ్రానైట్ లారీలను నిలుపుదల చేసి ధర్నాకు దిగారు. దీంతో పెద్ద ఎత్తున గ్రానైట్ వాహనాలు నిలిచిపోయాయి.



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

అమ్మ ఆశీస్సులు ప్రజలకు అందాలి

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి ఆశీస్సులు నియోజక వర్గంలోని ప్రజలకు అందాలని, రైతులకు సాగు సక్రమంగా జరగాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. దసరా దేవీ నవరాత్రులు సందర్భంగా 300 కాలనీ, పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు అమ్మ వారిని విశేష అలంకరణలతో అలంకరించి పూజలు చేశారు. అంతకుముందు కార్యక్రమానికి హాజరయిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అన్నసంతర్పణలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. ఆయన వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు

జగజ్జనని పాలయమాం

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారు విశేష పూజలందుకుంటున్నారు. వివిధ ఆలయా ల్లో దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల వద్ద విశేష పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

-పంగులూరు, బల్లికురవ, పర్చూరు, చినగంజాం, అద్దంకి



రేణంగివరం త్రిశక్తిపీఠంలో దుర్గాదేవి అలంకరణ, నక్కబొక్కలపాడులో దుర్గా దేవిగా పోలేరమ్మ తల్లి, పర్చూరులో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు, నాగరాజుపల్లిలో దుర్గాదేవి అలంకారంలో అ మ్మ వారు, అద్దంకిలో కన్యకా పరమేశ్వరికి విశేష అలంకరణ

అవీ..ఇవీ..

పేరుమారని విలేజ్ క్లీనిక్..!


భవనంపై ఉన్న వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేరు

అద్దంకి,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగరకొండ పాలెంలోని విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనంపై ఉన్న పేరును చూస్తే ఇంకా వైసీపీ పాలనలోనే ఉన్నామన్న భావన కలగక మానదు. వైసీపీ హయాంలో ఇష్టానుసారం వారు పేర్లు మార్చుకున్నారు. ఏడాదిన్నర క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పేర్లను మార్చింది. ఈ క్రమంలో వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పేర్లను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ గా మార్పు చేశారు. అయితే నేటికీ శింగరకొండపాలెంలోని హెల్త్ క్లీనిక్‌పై పేరు మారలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని గ్రామాలలో భవనాలపై ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇంటి ముందు ఉంచిన బైకు చోరీ

- కొమ్మినేనివారిపాలెంలో మాయం
- గుంటూరులో స్వాధీనం

బల్లికురవ, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేని వారిపాలెంలో ఇంటి ముందు ఉంచిన బైకును సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు అపహరించారు. అందిన సమాచారం మేరకు కొమ్మినేవారిపాలెం గ్రామానికి చెందిన మల్లిపెద్ది నాగులుమీరా అనే రైతు తన బైకును ఇంటి ముందు ఉంచి ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు బైకును చోరీ చేశారు. మంగళవారం ఉదయం నిద్ర లేవగానే బైకు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ చోరీ చేసిన బైకు గుంటూరులో పట్టుబడినట్లు తెలిసింది.

వెంపరాలలో పారిశుధ్య పనులు

- జ్వరపీడితుల వివరాలకు ఇంటింటి సర్వే
- నేడు వైద్య శిబిరం


జ్వరపీడితుల వివరాలు తెలుసుకుంటున్న వైద్యసిబ్బంది

అద్దంకి,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాలలో పారిశుధ్య పనులు, జ్వరపీడితుల వివరాల సేకరణకు ఇంటింటి సర్వే చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'వెంపరాలను వెంటాడుతున్న విషజ్వరాలు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. పంచాయతీ సర్పంచ్ వెంకాయమ్మ పాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావులు మురుగుకాల్వలలో నిలిచిన మురుగు నీరు పారుదలకు వీలుగా పూడికతీత పనులు చేయించారు. సైడ్ డ్రైన్‌లు, మురుగు నిలబడే ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించారు. మోదేపల్లి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ సత్తార్, పీహెచ్ఎన్ కన్యాకుమారిల ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరపీడితుల వివరాలను సేకరించారు. జ్వరాలతో పలువురు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో బుధవారం వెంపరాలలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు తెలిపారు.

శుభ్రపడుతున్న డంపింగ్ యార్డు

- వ్యర్థాలను నాలుగు రకాలుగా విభజన
- రైతులకు మేలు చేసేలా సేంద్రియ ఎరువు తయారీ


డంపింగ్ యార్డులో వ్యర్థాను శుద్ధిచేసిన తరువాత వచ్చే ఎరువును లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్, చెత్తను శుద్ధి చేస్తున్న యంత్రం

అద్దంకి, సెప్టెంబర్30(ఆంధ్రజ్యోతి): అద్దంకి కొండ వద్ద టిడ్కో ఇళ్ల సమీపంలోని డంపింగ్ యార్డు వైపు వెళ్ళాలంటే ఇటీవల వరకు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. దీంతో టిడ్కో ఇళ్లు పూర్తయినా, అక్కడ నివాసం ఉండేందుకు లబ్ధిదారులు వెనుకడుగు వేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తీసుకున్న నిర్ణయం తో డంపింగ్ యార్డు స్థానంలో పార్కు అందుబాటులోకి రానుంది. గత దశాబ్ద కాలంగా అద్దంకి పట్టణంలో సేకరించిన చెత్త మొత్తం అద్దంకి కొండకు తూర్పు వైపున సుమారు 4 ఎకరాలు డంపింగ్ యార్డుగా మార్చారు. డంపింగ్ యార్డులో ఉన్న సుమారు 58 వేల మెట్రిక్ టన్నుల చెత్తను చిలకలూరిపేట కు చెందిన తరుణి స్వచ్ఛంద సంస్థ స్క్రీనింగ్ ద్వారా 4 రకాలుగా విభజిస్తోంది. స్క్రీనింగ్ ద్వారా వచ్చే ఘన వ్యర్థాలు, రాళ్లు, అద్దంకి పట్టణంలోని రేణింగవరం రోడ్డులో అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలోని గుంతను పూడ్చుతున్నారు. ఎరువును తరుణి స్వచ్ఛంద సంస్థ రైతులకు అందజేయనుంది.. కాగితాలు, పాత దుస్తులను జిందాల్ సంస్థకు తరలిస్తున్నారు. మిగిలిన వ్యర్థాలను కాల్చివేయనున్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి డంపింగ్ యార్డు వద్ద ఉన్న వ్యర్థాలు అత్యధిక శాతం తొలగించే విధంగా చేస్తున్నారు. పూర్తి స్థాయిలో తొలగింపు చేపట్టిన తరువాత ఆ ప్రాంతాన్ని ఉద్యానవనంగా అభివృద్ధి చేయనున్నారు. సాధారణంగా డంపింగ్ యార్డుగా వినియోగించిన ప్రాంతంలో 15 సంవత్సరాల పాటు ఎలాంటి కట్టడాలు నిర్మాణం చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అద్దంకి కొండ వద్ద ఉన్న డంపింగ్ యార్డు ప్రాంతం కొండ ప్రాంతం కావడంతో నేల గట్టితనంగా ఉండే అవకాశం ఉంది. దీంతో కొద్ది సంవత్సరాల తరువాత మున్సిపల్ అవసరాలకు, ఇళ్ల స్థలాల కోసం వినియోగించే అవకాశం ఉంది. దీంతో సుమారు 4 ఎకరాల భూమి మున్సిపాలిటీకి చెందనుంది. అయితే ప్రస్తుతం అద్దంకి పట్టణంలో ప్రతి రోజు 19 టన్నులు చెత్త సేకరణ జరుగుతుండగా 10 టన్నులు మాత్రం ప్రతిరోజు నేరుగా గుంటూరులోని జిందాల్‌కు తరలిస్తున్నారు. మిగిలిన 9 టన్నులలో 1.5 టన్ను వరకు ఎరువుగా మారుతుంది. మిగిలిన చెత్తను ఏవిధంగా వినియోగించాలన్న విషయంపై పై ఉన్నతస్థాయి అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. డంపింగ్ యార్డు శుభ్రం అవుతుండటంతో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత లబ్ధిదారులకు దుర్వాసన వచ్చే అవకాశం తప్పింది.

ఉత్సాహభరితంగా సూపర్‌లీగ్ ఖోఖో పోటీలు

గ్రామీణ క్రీడ ఖోఖోను ఆదరించాలి
అసోసియేషన్ ఉపాధ్యక్షులు గురుప్రసాద్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గురుప్రసాద్, పోటీపడుతున్న జట్లు

పంగులూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ నిర్వహిస్తున్న సూపర్‌లీగ్ ఖోఖో పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ఎంఎస్ఆర్అండ్ బీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఖోఖో పోటీలను సౌత్‌జోన్ ఖోఖో అసోషియేషన్ ఉపాధ్యక్షులు కె.గురుప్రసాద్, నెల్లూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాచినేని గిరిప్రసాద్, సతీష్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణక్రీడ ఖోఖోను ప్రజలు ఆదరించాలన్నారు. సూపర్ లీగ్ పోటీలు క్రీడాకారులు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి దోహద పడతాయన్నారు. పాఠశాల స్థాయి నుంచి ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడలలో రాణించిన వారికి ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, ఉపాధి అవకాశాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో అకాడమి డైరక్టర్ ఎం సీతారామిరెడ్డి, పలువురు పీడీలు, అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సూపర్‌లీగ్‌లో సత్తా చాటుతున్న క్రీడాజట్లు

ఉత్సాహభరితంగా మంగళవారం జరిగిన ఖోఖోలీగ్ పోటీలలో ఫైర్‌కింగ్స్‌పై డైవింగ్ డీర్స్, వైల్డ్ వారియర్స్‌పై రైజింగ్ ఈగల్స్ విజయం సాధించగా, డైనమిక్ డ్రాగన్స్‌పై ఐరన్‌బుల్స్, డైవింగ్ డీర్స్‌పై వైల్డ్ వారియర్స్ విజయం సాధించారు. సోమవారం రాత్రి వర్షం కారణంగా పోటీలు నిలిచిపోవడంతో బుధవారం పోటీలను కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నిబద్ధత కలిగిన మహోన్నత వ్యక్తి హనుమంతరావు

అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య


సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెంచుగరటయ్య

ఇంకొల్లు,సెప్టెంబరు 30, (ఆంధ్రజ్యోతి) : మంచి వ్యక్తి త్వం, నియమ నిబద్ధత ఉన్న మహోన్నత వ్యక్తి మద్దినేని హనుమంతరావు అని అద్దంకి మాజీ శాసనసభ్యులు బాచిన చెంచుగరటయ్య అన్నారు. ఇటీవల మృతి చెందిన మద్దినేని హనుమంతరావు సంస్మరణ సభ మంగళవారం ఇంకొల్లు రోటరీ గంగ ఆవరణలో డాక్టర్ బీరం సుందరరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో గరటయ్య మాట్లాడుతూ ఉత్తమ ప్రజా సేవకుడిగా ఇంకొల్లు ప్రాంతంలో హనుమంతరావు పేరుపొందారన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్‌గా, ఎంపీపీగా, రోటరీక్లబ్ అధ్యక్షుడిగా ఇంకొల్లు ప్రాంత అభివృద్ధికి సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానంద రెడ్డి, వీరగంధం ఆంజనేయులు, కుర్రా హనుమంతరావు, భవనం శ్రీనివాసరావు, జడ్పీటీసి భవనం శ్రీలక్ష్మీ, రావి అంకమ్మ, రవీంద్రారెడ్డి, రావి సత్యనారాయణ, రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. సోమవారం రాత్రి మాజీ ఎంపీ జెడీ శీలం హనుమంతరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అసైన్డ్ భూముల్లో అక్రమ రిసార్ట్స్ వివాదం

- గతంలో ఒక నిర్మాణానికి నోటీసులు
- తాజాగా మరొకటి ప్రారంభం
- ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు


తీరాన్ని చదును చేసి పార్కింగ్ వినియోగం(ఫైల్)

రామాపురం(చీరాల), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు, రామాపురం సముద్రతీర ప్రాంతాల్లో అక్రమ రిసార్ట్స్ నిర్వహణ తారాస్థాయికి చేరుతోంది. సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యూలేషన్ జోన్) నిబంధనలకు తిలోదకాలిచ్చి యథేచ్ఛగా భవనాలు నిర్మించి జేబులు నింపుకుంటున్నారు. అంతేకాకుండా సముద్రతీరానికి రక్షణ కవచంలా ఉన్న ఇసుక దిబ్బలు సైతం కూల్చి చదును చేసుకొని రిసార్ట్స్‌కు పార్కింగ్‌లుగా వినియోగించుకుంటున్నారు. ఇదిలా ఉంటే అసైన్డ్ భూమిలో అక్రమ రిసార్ట్ నిర్మించారంటూ రెవెన్యూ అధికారులు తీరంలోని గ్రాండ్ ఆర్య బీచ్ రిసార్ట్స్‌కు నోటీసులు అందించారు. దీనిపై ప్రస్తుతం అధికారులకు, నిర్వాహకులకు మధ్య వివాదం నెలకొంది. అయితే తాజాగా వెనుక భాగంలోని కారంచేడు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన సర్వే నెం.427/3-34లో ఇదే నిర్వాహకులు కన్‌స్ట్రక్షన్ చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఈక్రమంలోనే మంగళవారం ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే పూర్తిస్థాయిలో రెండింటిపై చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక చేపడుతున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

నేడు టీటీడీ కల్యాణ మండప ప్రారంభోత్సవం

- కార్యక్రమానికి హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు


సిద్ధమైన టీటీడీ కల్యాణ మండపం

నూతలపాడు (పర్చూరు), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో రూ.3.5 కోట్లతో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్మించిన టీటీడీ కళ్యాణ మండప ప్రారంభోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వహకులు మంగళవారం తెలిపారు. ప్రారంభకులుగా స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావు హాజరుకానున్నారు. ముఖ్య అతిథులుగా దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, బాపట్ల ఇన్‌చార్జి మంత్రి వర్యులు కొలుసు పార్థసారధి, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ పాల్గొంటారన్నారు.

ఫ్రాన్స్ పర్యటనకు మంత్రి గొట్టిపాటి



అద్దంకి, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): అధికారుల బృందంతో కలిసి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ఫ్రాన్స్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. నవంబరు 14, 15 తేదీలలో విశాఖపట్నంలో జరిగే సీఐఐ సదస్సుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి విద్యుత్ శాఖ అధికారుల బృందంతో కలిసి వెళ్లారు. ఫ్రాన్స్‌లో 4 రోజులపాటు అక్కడే ఉండి అధికారిక కార్యక్రమాలలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలను రవికుమార్ కలవనున్నారు. అనంతరం మరో రెండు, మూడు రోజులు వ్యక్తిగత పనులను నేపథ్యంలో అక్కడే ఉండే అవకాశం ఉంది. సుమారు వారంరోజుల పాటు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫ్రాన్స్ లో ఉండనున్నారు. అక్టోబరు 6న తిరిగి వచ్చే అవకాశం ఉంది.

వైసీపీ నేతలకు మాజీ మంత్రి పరామర్శ

మార్టూరు,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి మేరువ నాగార్జున మంగళవారం సాయంత్రం మండలంలోని డేగరమూడి గ్రామంలో ప్రమోదకుమార్, జ్యోతి పోతులూరిలను పరామర్శించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చేయాలనుకున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 10 రోజులలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుచేయాలని, లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట భవనం శ్రీనివాసరెడ్డి, తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నైపుణ్యాభివృద్ధి కోర్సులు


బ్యూటీషన్ కోర్సులో మెళుకువలను వివరిస్తున్న ట్రైనీ దివ్యతేజ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో బ్యూటీ అండ్ వెల్‌నెస్ ఒకేషనల్ నైపుణ్యాభివృద్ధి కోర్సును అందిస్తున్నట్లు హెచ్ఎం కే.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విద్యార్థినులకు బ్యూటీషన్‌పై ట్రైనీ జి.దివ్యతేజ మెళకులను, అవగాహన కల్పించారు. దసరా సెలవుల నేపథ్యంలో ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రధాన మురుగుకాలువలో పూడికతీత


ప్రధాన కాలువలో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్

ఇంకొల్లు, సెప్టెంబరు 30,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయితీ పరిధిలోని ప్రధాన మురుగుకాల్వలలో పూడికతీత పనులు చేపట్టారు. గొల్లపాలెం రోడ్డులోని ప్రధాన మురుగు కాల్వలో పూడికను ఎక్స్‌కవేటర్ సహాయంతో రెండు రోజులుగా తొలగిస్తున్నారు. బాలికోన్నత పాఠశాల నుంచి శివబ్రహ్మకాలనీ చివరి వరకు మురుగు పూడికను తొలగిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన మురుగుకాల్వల పూడికను తీసి అభివృద్ధి చేయనున్నట్లు కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను మురుగుకాల్వల్లో వేయరాదన్నారు. దోమలువృద్ధి చెందకుండా ఫాగింగ్ చేసి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆయుర్వేద మందులను వినియోగించుకోవాలి


మందులను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

మార్టూరు, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులను సక్రమంగా వినియోగించుకుంటే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి బయట పడతారని వైద్యాధికారి జి.అంజమ్మ అన్నారు. 'స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్' క్యాంప్‌లో భాగంగా మంగళవారం మార్టూరులోని కమ్యూనిటి హెల్త్ సెంటరు వారి ఆధ్వర్యంలో స్థానికంగా అమ్మ ఆశ్రమంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు,పేదలకు వివిధ వ్యాధులకు సంబందించి ఆయుర్వేద మందులను వైద్యాధికారి పంపిణీ చేశారు. దాదాపుగా 45 మందికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంపౌండర్ తనూజ, ఎస్‌కే ఖాజా బి, ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో ఇంద్రధనుస్సు కనువిందు

- ఆసక్తిగా తిలకించిన ప్రజానీకం


ఆకాశంలో కనువిందు చేస్తున్న ఇంద్రధనుస్సు

మార్టూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రంగురంగులతో ఇంద్రధనుస్సు మంగళవారం సాయంత్రం మార్టూరులో ఆకాశంలో కనిపించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఏడురంగుల ఇంద్రధనుస్సు ఏమోగాని మూడురంగులైన ఎరుపు, లేతపసుపు, నీలం రంగులతో ఇంద్రధనుస్సు కనిపించింది. అంతేగాకుండా ఈ ఇంద్రధనుస్సుపై భాగంలో మరో ఇంద్రధనుస్సు కూడా కనిపించింది. దీంతో రెండు ఇంద్రధనుస్సులు కనిపించాయని ప్రజలు ఉత్సాహంగా తిలకించారు. ఆకాశంలో తూర్పుదిక్కున కనిపించడంతో కొంతమంది ప్రజానీకం వర్షాలు పడవని, కాదు వర్షాలు బాగా పడతాయని మరికొంతమంది ప్రజానీకం ఆసక్తిగా చర్చించుకున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

అద్దంకి, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అనిల్‌కుమార్(22) చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు బల్లికురవ మండలం సూరేపల్లికి చెందిన పి.అనిల్‌కుమార్ మరోవ్యక్తితో కలిసి మోటార్‌సైకిల్‌పై పదిరోజుల క్రితం అద్దంకి వస్తూ చక్రాయపాలెం సమీపంలో అదుపు తప్పి పడిపోయారు. అనిల్‌కుమార్ ఒంగోలులోని ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు అద్దంకి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

చినగంజాం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమంపై ప్రజావేదికను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో కె.ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ ప థకం ద్వారా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై ఈ నెల 21 నుంచి 29వ తేది వరకు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశములపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.


ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

బుధవారం 1 అక్టోబరు 2025







రాపూరు : పెంచలకోనలో రాజ్యలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి

సంగం : దుర్గాదేవిగా దర్శనమిచ్చిన కామాక్షిదేవి

జయహో దుర్గా భవానీ!

భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి • కనుల పండువగా కన్యక పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్న వరాత్రి ఉత్సవాల్లో మంగళవారం దుర్గాష్టమి పర్వదినిని జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఉదయం నుంచి విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు, హోమాలు జరిగాయి. పలు ఆలయాల్లో నవబాల దుర్గాపూజ, కన్యక పూజలు కనుల పండువగా చేశారు. చిన్నారులను అమ్మవార్లుగా అలంకరించి పూజించారు. నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయం, మూలస్థానేశ్వర ఆలయం, ఇరుకళల పరమేశ్వరి, కన్యకాపరమేశ్వరి, జొన్నవాడ కామాక్షితాయి, పెంచలకోన, వేదగిరి, కావలి కలుగోళమ్మ ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



నెల్లూరు : రాజరాజేశ్వరి ఆలయంలో భక్తులను ఆకట్టుకున్న యువతల ప్రదర్శన





కావలి : దుర్గాదేవిగా కలుగోళ శాంభవి

బుచ్చి : జొన్నవాడలో దుర్గాదేవిగా కామాక్షితాయి



నెల్లూరు : దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు : దుర్గాదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు

మహిళలకు అందని కుట్టు మిషన్లు

నిర్వాహకుల చుట్టూ ప్రదక్షిణలు

శిక్షణ సమాప్తం.. లబ్ధికి దూరం!

ఉదయగిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కుట్టు శిక్షణ ప్రక్రియ ముగిసినా లబ్ధిదారులకు ఆ ఫలాలు అందనంటున్నాయి. ధ్రువపత్రం, ఉచితంగా అందించే కుట్టు మిషన్ కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా 31 కేంద్రాల్లో 1,250 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నారు. బీసీ కార్పొరేషన్ పర్యవేక్షణలో జరిగే ఈ శిక్షణ ఇప్పటికే 26 కేంద్రాల్లో పూర్తవగా, రాపూరు, కలువాయి, కుక్కలగుంట, బుచ్చిరెడ్డిపాళెం, కలిగిరి కేంద్రాల్లో కొనసాగుతోంది. మూడు నెలల్లో పూర్తి కావాల్సిన శిక్షణ పలుచోట్ల నిర్వాహకులు పక్కాగా అమలు చేయకపోవడంతో జాప్యం జరుగుతోంది. శిక్షణ అనంతరం ఇచ్చే ధ్రువపత్రం ద్వారా మహిళలు ఫ్యాషన్ డిజైనింగ్‌లో ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలు పొందుతారని ప్రభుత్వం ఆశిస్తోంది.

• 2 నెలలుగా ఎదురుచూపు

జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఉచిత కుట్టు మిషన్ కోసం నిర్వాహకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉదయగిరి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో 136 మంది మహిళలు కుట్టు శిక్షణ పొందారు. అయితే శిక్షణ పూర్తయి 2 నెలలు గడుస్తున్నా ఇంత వరకు కుట్టు మిషన్ ఇవ్వకపోవడంతో నిర్వాహకుడ్ని ప్రశ్నిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని శిక్షణ పొందిన మహిళలు కోరుతున్నారు.



కుట్టుపై శిక్షణ పొందుతున్న మహిళలు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం

జిల్లాలో 31 కేంద్రాల ద్వారా మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే 26 కేంద్రాల్లో పూర్తయ్యింది. ఐదు కేంద్రాల్లోనూ శిక్షణ పూర్తవగానే, రెండో విడత శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ పూర్తయిన వారికి కుట్టు మిషన్ల పంపిణీ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.

- నిర్మలాదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

బంగారం కోసం ఘాతుకం

చెముడుగుంటలో దారుణ హత్య 6

రక్తదాతల్లారా.. స్పందించండి!

ఏడాదికి 10వేల యూనిట్ల లోటు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

6

మరో ఇద్దరికి డైరెక్టర్ పదవులు

నెల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్ల జాబితాలో జిల్లాలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరికి చోట దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్లుగా నెల్లూరు రూరల్‌కు చెందిన మన్నెం పెంచలనాయుడు, ఉదయగిరికి చెందిన మధుసూదన్ తాళ్లపనేని నియమితులయ్యారు. కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి కూడా జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం. కాగా రాష్ట్ర బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఉమ్మడి జిల్లాలోని గూడూరుకు చెందిన కొడిపర్తి శ్రీధర్, సూళ్లూరుపేటకు చెందిన పళని బొమ్మనలు నియమితులయ్యారు.

ట్రూఅప్ పోయింది..

ట్రూడౌన్ మొదలైంది!

వైసీపీ హయాంలో కరెంటు బిల్లుల బాదుడు •

ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పెరిగిన చార్జీలు •

దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టిన ప్రస్తుత ప్రభుత్వం •

నవంబరు నుంచి ట్రూ డౌన్ చార్జీలు • యూనిట్‌కు 13 పైసల తగ్గింపు?


జిల్లా వినియోగదారులకు భారీ ఊరట •

నెలకు రూ. 6.24 కోట్లు, ఏడాదికి రూ.75 కోట్ల లబ్ధి •

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం కానీ పెంచం.' గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ఇది. కాస్త ఆలస్యమైనా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. యూనిట్‌పై 13 పైసలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. నవంబరు నెల బిల్లు నుంచి తగ్గించిన చార్జీలు అమలులోకి రానున్నాయి. దీనివల్ల జిల్లాలో కరెంటు వినియోగదారులకు నెలకు రూ.6 కోట్లు, సంవత్సరానికి రూ.72 కోట్ల మేర మిగులు రూపంలో లబ్ధి చేకూరనుంది.

నెల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 11,94,474 ఎల్‌టీ సర్వీసులు ఉండగా, రోజుకు 1.50 నుంచి 1.70 కోట్ల యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతోంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి సగటున ఏడాదికి రెండ్లు సార్లు చొప్పున మొత్తం 9 సార్లు ట్రూఅప్ చార్జీలు పెంచారు. దీంతో కరెంటు బిల్లు తడిసి మోపెడయ్యింది. పేద, మధ్య తరగతి వినియోగదారులు ఈ భారం భరించలేక అల్లాడిపోయారు. ప్రజల కష్టాన్ని గమనించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ప్రజలకు మాట ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గేది తప్ప పెరిగేది ఉండదని స్పష్టం చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ (ఈఆర్‌సీ)తో చేసుకున్న ఒప్పందం కారణంగా ఏడాదిన్నర కాలంగా చార్జీలు తగ్గించే అవకాశం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఉత్పాదక రంగంలో అమలు చేసిన సంస్కరణల్లో భాగంగా డిస్కంలకు మిగులు ఏర్పడింది. ట్రుఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలు ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ఆరంభంలో విద్యుత్ కొనుగోలు, సరఫరా వ్యయాన్ని అంచనా వేసి యూనిట్‌కు ఇన్ని పైసలు పెంచాలని డిస్కంలు ఈఆర్సీకి సిఫార్సు చేయడం, దానిని ఈఆర్‌సీ ఆమోదించడం, ఆ మేరకు వసూళ్లు చేయడం జరుగుతోంది. అయితే ఏడాది ఆఖరున విద్యుత్ ఉత్పాదక వ్యయం, నిర్ణయించిన ట్రూఆప్ చార్జీలను లెక్కగట్టి ఖర్చు పెరిగి ఉంటే ట్రూఅప్ చార్జీలను పెంచడం, ఖర్చు తగ్గి ఉంటే ఆ మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి చెల్లించడం జరగాలి. అయితే ఖర్చు పెరిగినప్పుడు ట్రూఆప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలను పెంచతూ వెళ్లారు తప్ప మిగిలినప్పుడు ఆ లాభాలను డిస్కంలే పంచుకొంటూ వెళ్లేవి. అయితే చంద్రబాబు ప్రభుత్వం మిగులు మొత్తాన్ని ప్రజలకు పంచేయాలని నిర్ణయించుకుంది. దీని ఫలితంగా ట్రూ డౌన్ శకం మొదలయ్యింది. విద్యుత్ నియంత్రణ మండలి చరిత్రలో డిస్కంలు మిగులు మొత్తాన్ని ఇలా ప్రజలకు పంచేయాలని నిర్ణం తీసుకోవడం విద్యుత్ నియంత్రణ మండలి చరిత్రలో తొలిసారి కావడం గమనార్హం.

• నెలకు రూ.కోట్లలో మిగులు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలితంగా నవంబరు బిల్లు నుంచి యూనిట్‌పై 13పైసలు తగ్గనుంది. ఇది జిల్లా ప్రజలకు పెద్ద ఊరట కలిగించనుంది. జిల్లా పరిధిలోని 11.94 లక్షల ఎల్‌టీ సర్వీసులు రోజుకు సగటున 1.60 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తున్నాయి. ప్రస్తుతం యూనిట్‌పై 40 పైసలు చొప్పున ట్రూఅప్ చార్జీలు వసూళ్లు చేస్తున్నారు. నవంబరు నుంచి ఒక యూనిట్‌పై విధించే 40 పైసలు ట్రూఅప్ చార్జీలో 13 పైసలు తగ్గుతుంది. ఒక యూనిట్‌పై 13పైసలు చొప్పున ఒక రోజు ఖర్చు చేసే 1.60 కోట్ల యూనిట్లపై లెక్కగడితే రోజుకు 20.80 లక్షల రూపాయల వరకు వినియోగదారులకు మిగులు ఏర్పడుంది. నెల రోజులకు లెక్కకడితే రూ.6.24 కోట్ల రూపాయల మేర జిల్లా ప్రజలకు మిగులు రూపంలో లబ్ధిచేకూరనుంది. ట్రూ డౌన్ ఏడాది కాలం కొనసాగితే జిల్లా ప్రజలకు సుమారు రూ. 75 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.



రాజరాజేశ్వరి ఆలయంలో ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న మంత్రి ఆనం

వేణుగోపాలస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు 29న ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునః నిర్మాణ పనులు అక్టోబరు 29వ తేదీన ప్రారంభమవుతాయని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరి, మూలస్థానేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలను ఆనం సందర్శించి పూజలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో పునఃనిర్మాణ పనుల వ్యాపులను పరిశీలించి, ఇంజనీర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఈ పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఆలయాన్ని రూ.16.7 కోట్లతో అత్యంత అందంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

• 9 కోట్లతో ధ్యాన మందిరం, కల్యాణ మండపం

రాజరాజేశ్వరి ఆలయానికి చెందిన ఖాళీ స్థలంలో రూ.9 కోట్లతో కల్యాణ మండపం, ధ్యాన మందిర నిర్మాణాలు జరుగుతున్నాయని ఆనం తెలిపారు. ప్రతి దేవాలయంలో స్థానిక ఎమ్మెల్యే, ఆలయ పాలక మండలి అభిప్రాయం మేరకు అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. రాజరాజేశ్వరి కల్యాణ మండపానికి దాతలు రూ.5కోట్లు ఇస్తున్నారని, మిగిలిన రూ.4కోట్లు దేవదాయ శాఖ నుంచి కేటాయిస్తున్నట్లు తెలిపారు.

జలాశయాలు ఫుల్.. అన్నదాత హ్యాపీ!

• నిండుకుండల్లా సోమశిల, కండలేరు డ్యాంలు

• గరిష్ఠ మట్టానికి చేరుకున్న నీటి నిల్వలు

• రెండు జలాశయాల్లో కలిపి 132 టీఎంసీల నిల్వ

• రానున్న రెండు సీజన్లకూ ఢోకా లేదు

నెల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సహకారం, ప్రభుత్వ ముందుచూపుతో జిల్లాలోని జలాశయాలు కళకళలాడుతున్నాయి. వరుసగా రెండో ఏడాది కూడా సోమశిల, కండలేరు రిజర్వాయర్లు నిండుకుండల్లా మారాయి. ఎన్నడూ లేని విధంగా ఈదఫా రబీ సీజన్ ప్రారంభానికి ముందే రెండు జలాశయాలు నిండటం విశేషం. మరే జిల్లాలోనూ లేని విధంగా నెల్లూరు జిల్లాలో 132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రబీ సీజన్‌తోపాటు వచ్చే ఏడాది రెండో పంటను కూడా ఈ నీటితో పుష్కలంగా పండించుకోవచ్చు. ఈ ఫలాలు ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కూడా అందనున్నాయి. సోమశిల పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం దాదాపు 74 టీఎంసీలకు నీటిమట్టం చేరుకుంది. అలానే కండలేరు జలాశయం పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 58 టీఎంసీలకు చేరుకుంది. జిల్లాలో వర్షాకాల సీజన్ ఇంకా ముందుండడంతో ఇంతకు మించి ఈ రెండు జలాశయాల్లో నీటి నిల్వ చేయడం మంచిది కాదని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయానికి వచ్చారు. భవిష్యత్‌లో భారీ వర్షాలు, తుఫాన్లు వచ్చినా ఆ వరద నీటితో జలాశయాలకు ఇబ్బంది లేని విధంగా కుషన్ పెట్టుకొని జలాశయాలను నింపారు. ఇంకా సోమశిలకు 30 వేల క్యూసెక్కుల వరకూ ఇన్‌ఫ్లో నమోదవుతోంది. కండలేరుకు 10,500 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, దానిని 4 వేల క్యూసెక్కులకు తగ్గించారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా ఆపేసే అవకాశాలున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. ఇక పెన్నాలో వచ్చిన నీటిని వచ్చినట్లు సముద్రానికి వదిలేయనున్నారు.



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలు

• ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో..

జిల్లాలో వర్షాకాల సీజన్‌కు ప్రారంభం ముందే రెండు ప్రధాన జలాశయాలు నిండటం చరిత్రగా ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. గతేడాది అపార్ తుఫాన్ తర్వాత డిసెంబరులో సోమశిల గరిష్ఠ మట్టానికి చేరుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ ఏడాది ముందుగానే కృష్ణా నదికి వరదలు పోటెత్తడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకూ అన్ని జలాశయాలు నిండిపోయాయి. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలను సోమశిలకు తరలించేందుకు ఇదే మంచి తరుణమన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. ఆ వెంటనే జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి ప్రభుత్వ స్థాయిలో మాట్లాడారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణా జలాలను సోమశిలకు విడుదల చేసేందుకు కృషి చేశారు. తొలుత 4 వేల క్యూసెక్కులకు మించి విడుదల కాలేదు. మరోసారి 'ఆంధ్రజ్యోతి'లో 'వరదలున్నా వెలవెలే..' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈదఫా కూడా ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి విడుదలను పెంచారు. ఆ తర్వాత క్రమేనా 15 వేల క్యూసెక్కుల వరకూ సోమశిలకు విడుదల కావడం ప్రారంభమైంది. ఇదే సమయంలో రాయలసీమ ప్రాంతంలో పెన్నా క్యాచ్‌మెంట్లో వర్షాలు కురవడం కూడా కలిసొచ్చింది. ఇలా మూడు నెలల కాలంలో 100 టీఎంసీలకుపైగా నీరు సోమశిల, కండలేరు జలాశయాలకు చేరింది.



కొత్త మినగల్లు ఘటనపై హోంమంత్రి సీరియస్

- వివరాలు 6లో..

నేడు సామాజిక పెన్షన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ బుధవారం ప్రారంభమవుతుంది. 3,07,543 మందికి రూ.133.70 కోట్ల పెన్షన్‌ను పంపిణీ చేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు.

సోమశిలకు 29,593 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి మంగళవారం 29,593 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. డ్యాంలో 73.187 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా డెల్టాకు 2,650, క్రస్ట్‌గేట్ల ద్వారా 23,000 ఉత్తర కాలువకు 150, కండలేరుకు 4,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100):	530

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

ఉలవపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం మంగళవారం ఉలవపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలోని యువతను చెడు వ్యవసనాల వైపునకు మళ్లించే అసాం ఘిక కార్యక్రమాలపై దృష్టి సారించాలని, గ్రామాల్లో పేకాట నిర్వహణకు తావివ్వకుండా అరికట్టాలని ఎస్ఐ అంకమ్మకు సూచించారు. పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఆయన పోలీస్ స్టేషన్ చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట కందుకూరు సీఐ అన్వర్‌బాషా ఉన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



ఆక్రమణల చెరలో చెరువులు!

- యథేచ్ఛగా పంటలు, తోటల సాగు
- సాగునీటికి ఆయకట్టు రైతుల అవస్థ

లింగసముద్రం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సాగు నీటి చెరువులు ఆక్రమణల చెరలో చిక్కుకున్నాయి. ఆక్రమిత భూముల్లో ఆక్రమణదారులు ప్రతీ ఏటా యథేచ్ఛగా పంటలు సాగు చేసి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. కొందరైతే ఏకంగా శాశ్వత ప్రాతిపదికన మామిడి తోటలు వేశారు. దీంతో సాగునీటి చెరువుల విస్తీర్ణం కుంచించుకుపోతోంది. దీంతో చెరువులకు చేరుతున్న నీరు పంటల సాగుకు సరిపోక ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో లింగసముద్రం కొత్త చెరవు కింద 117 ఎకరాలు, పాత చెరువు పరిధిలో 714, విశ్వనాథపురం 158, వీఆర్ కోట 290, చినపవని 612, పెదపవని 415, మేదరమెట్లపాలెం చెరువు 120 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులలో జోరుగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ముఖ్యంగా 2016లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాగు నీటి చెరువులలో ఆక్రమణలను తొలగించాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో అప్పట్లో మైనర్ ఇరిగేషన్ అధికారులు సాగు నీటి చెరువుల హద్దులను తేల్చి, ఆక్రమణలను తొలగించేందుకు సన్నద్ధం అయ్యారు. అయితే అప్పట్లో పెదపవని చెరువును సగ భాగం సర్వే చేయగా, మొగిలిచెర్ల చెరువును ఆక్రమణదారులు పూర్తిగా సర్వే చేయనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో లింగసముద్రం కొత్త, పాత చెరువులను కూడా సర్వే చేసేందుకు రెవెన్యూ, సర్వే అధికారులు సహకరించలేదని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. వీఆర్ కోట, చినపవని, మేదరమెట్లపాలెం చెరువులను పూర్తిగా సర్వే చేసి ట్రెంచ్ కూడా వేశారు. అయితే మిగిలిన చెరువులను సర్వే చేయకపోవడంతో



పెదపవని చెరువు భూమిని ఆక్రమించి సాగు చేసిన మామిడి తోట

ట్రెంచ్ ఏర్పాటు చేయలేదు. ఆక్రమణదారులు చెరువుల లోపల ఉన్న భూములతో పాటు చెరువుల చుట్టూ లోపలి హద్దులను కూడా ఆక్రమించుకొని పైర్లు సాగు చేస్తున్నారు. అంతేగాకుండా చెరువులకు ఎగువ నుంచి నీరందించే వరవ కాలువలను కూడా ఆక్రమించుకొని పైర్లు సాగు చేస్తున్నారు. ఇదిలావుండగా మండలంలోని 8 సాగు నీటి చెరువులలో ఆక్రమణదారులు జామాయిల్, మామిడి, నిమ్మ, వరి, మెట్ట పైరు సాగు చేయడంతో పాటు కొందరు పక్కా గృహాలు కూడా నిర్మించుకొన్నారు. ఆక్రమణదారులకు పుష్కలంగా రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్న చర్చ జరుగుతోంది. దీంతో సాగు నీటి చెరువులలో నీటి నిల్వ పరిమాణం తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా పెరుగుతున్న ఆక్రమణలను అడ్డుకుని ఉన్న ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.





సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి : ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యసిబ్బంది కీలకపాత్ర పోషించాలని, సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరిగిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల్లో రక్తహీనత అధికంగా కనిపిస్తోందని, దీని నివారణకు ఆరోగ్యసిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి కూడా మహమ్మారిలా వ్యాపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి డాక్టరు శేషారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు.



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

డాక్టరు శకుంతల, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, గడ్డం మాలకొండయ్య, శిగా తిరుపాలు, మువ్వల భూషయ్య, మన్నేపల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.

● ఆసుపత్రి అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

ఉలవపాడు మండలం రామాయపట్నం పోర్టు పరిధిలో రాబోతున్న భారీ పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు కేటాయించి కందుకూరు ఏరియా ఆసుపత్రిని కార్పొరేట్‌స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సక్షమ్ సంస్థ ఆధ్వర్యంలో 10 మందికి అలింకో కంపెనీకి చెందిన వినికిడి యంత్రాలను అందజేశారు. ఎమ్మెల్యేని డాక్టర్లు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్

● చిన్నారులకు అభినందన

కందుకూరు పట్టణానికి చెందిన చిన్నారులు తమ నాట్యప్రతిభతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అద్భుతాలు సృష్టిస్తూ నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించటం పట్ల ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారిని ప్రత్యేకంగా అభినందించారు. నటరాజ నాట్యమండలి-సరస్వతీ నిలయం ద్వారా తిరుమలశెట్టి వెంకటదత్తేశ్వరి శిక్షణలో మూడేళ్లుగా పలు అంతర్జాతీయ, జాతీయ వేదికలపై దత్తేశ్వరితో పాటు చిత్రపు కార్తీకవల్లి, నాగకృతికవల్లి, నాగసూరి శ్రీహస్వికలు పలు ప్రదర్శనలిచ్చి నోబెల్ వరల్డ్‌రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. వారికి సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు అందజేసి ఎమ్మెల్యే అభినందించారు. అలాగే ఆర్.లతికా, సీహెచ్ మన్విత, జి.సహస్, కె.గీతాసహస్ర, ఎన్‌హస్విక, సీహెచ్ కార్తీక, సీహెచ్ కృతిక, పీవీ సిరి, ఎం. యశస్విని, జీ. సాన్వి, బీ. వాసవి, కె.ప్రవిష్ణు, ఎస్. ఈషా, మాన్వి, ఈ. మన్విత తదితర చిన్నారులు జాతీయ పురస్కారాలు అందుకోగా వారినీ ఎమ్మెల్యే అభినందించారు.







దత్తాత్రేయ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

లింగసముద్రం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దుర్గాష్టమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆలయంలో గురువారం విజయదశమి రోజు భవానీ కంకణ దీక్ష భక్తులచే పండరి భజన, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం జరుగుతుందన్నారు. అదేరోజు రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.



దుర్గాదేవి అలంకరణలో రాజరాజేశ్వరి





నేటి నుంచి వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

లింగసముద్రం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవనిలో వెలసియున్న పావనక్షేత్ర వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి 3వ తేదీ వరకు 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. 2న ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని తెలిపారు.





మనస్పర్థలతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మనస్పర్థల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీలో షేక్ మున్నా(22), తస్లీమ్ దంపతులు నివసిస్తున్నారు. మున్నా వెల్డింగ్ పనులు చేసుకుంటూ భార్య, తల్లి దండ్రులను పోషిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను కొంత కాలంగా పనికి వెళ్లకుండా తిరగసాగాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. పదిరోజుల కిందట భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మున్నా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా మున్నా మృతిచెంది ఉన్నాడు. తండ్రి చాన్‌బాషా ఫిర్యాదుతో నవాబుపేట పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

చెముడుగుంటలో హత్య

వెంకటాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెముడుగుంట పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారికి కూతవేటు దూరంలో అనుమానాస్పద స్థితి లో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల కథనం మేరకు, బుజబుజ నెల్లూరులోని న్యూ కాలనీలో వల్లూరు మల్లికార్జున్ కుటుంబం నివాసం ఉంటోంది. కొంతకాలం నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మల్లికార్జున్ ఇటీవల కొంతవరకు కోలుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి కనిపించకుండా మల్లికార్జున్(55) జిల్లా జైలుకెళ్లే మార్గంలో శవమై తేలాడు.

● మృతిపై అనుమానాలు

కాగా మల్లికార్జున్ ఎవరితో గొడవపడే వ్యక్తికాదని, అలాంటి వ్యక్తి ఇలా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. మృతుడు ఎప్పుడూ చేతికి ఉంగరాలు, మెడలో బంగారు చైను ధరించి ఉంటాడని, కానీ అవి కనిపించకుండా పోవడంతో ఎవరైనా బంగారం కోసం హత్య చేసి ఉంటారన్న అనుమానం స్థానికుల్లో కలుగుతోంది. మృతుడి మెడ చుట్టూ టెంకాయ నారతాడు చుట్టి ఉండటం, ముఖంపై గాయాలతోపాటు తీవ్రస్థాయిలో దెబ్బలు తగిలి ఉండటం, తల పక్కనే బండరాయి కనిపించడంతో ఎవరో కిరాతకంగా హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు.

● నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

రక్తదాత సుఖీభవ!

● ఎందరో ప్రాణాలు కాపాడుతున్న దాతలు ● కానీ, అవసరానికి తగ్గట్టు అందని రక్తం
● ఏడాదికి 40వేల యూనిట్లు అవసరం.. అందుతున్నది 30వేల యూనిట్లే!
● ఈ సంఖ్య పెరగాలంటున్న వైద్యులు ● యువతలో చైతన్యంతో మరింత ప్రయోజనం

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏ శస్త్రచికిత్స చేయాలన్నా రక్తం కీలకం. అవసరమైన రక్తం లభించగా ఒక్కోసారి ప్రాణాలు కూడా పోయిన సందర్భాలు ఉన్నాయి. జిల్లాలో జరుగుతన్న అనేక ప్రమాదాల్లో క్షతగాత్రులకు, శస్త్రచికిత్సలకు. రక్తహీనత ఉన్న గర్భవతులకు ఆసుపత్రులకు వచ్చిన వెంటనే రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో రక్తనిధి కేంద్రాలు అవసరమైన రక్తం అందించలేని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం రక్తదాతల కొరతే. జిల్లాలో 27 లక్షల మంది జనాభా ఉన్నా వీరిలో కేవలం 50 వేల మంది మాత్రమే రక్తదానం చేస్తున్నారు. ఏడాదికి 40 వేల యూనిట్ల రక్తం అవసరం కాగా ప్రస్తుతం 30 వేల యూనిట్లు మాత్రమే రోగుల అవసరాలు తీర్చుతున్నారు. ప్రతి 100 మందిలో 15 మంది రక్తదానం చేస్తేనే జిల్లాలో రక్తం అవసరాలు తీరుతుంది. అయితే ప్రస్తుతం కేవలం ఐదుగురు మాత్రమే రక్తదానం చేస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం 70 శాతం మంది రోగులకు ఇండియన్ రెడ్‌క్రాస్ మాత్రమే అవసరమైన రక్తాన్ని అందిస్తోంది. బాధితులకు అత్యవసరంగా రక్తం అందించేందుకు దాతల సహకారం ఎంతో అవసరం. దాతల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది.

రెడ్‌క్రాస్ రక్తసేకరణ ఇలా

సంవత్సరం	రక్తం యూనిట్లు
2021-22	22,893
2022-23	24,017
2023-24	15,555
2024-25	17,000
2025-26 (ఇప్పటి వరకు)	12,450

● రెడ్‌క్రాసే దిక్కు

ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు రక్తం అందించటంలో రెడ్‌క్రాస్ రక్తనిధే దిక్కవుతుంది. ప్రధానంగా నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) వచ్చే రోగులకు రెడ్‌క్రాస్ అందించే రక్తం రోగుల పాలిట ప్రాణాధారం అవుతుంది. జీజీహెచ్‌లో రక్తనిధి ఉన్నా అది పూర్తిగా నిర్వీర్యం అయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇద్దరు ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ చేసిన వైద్య నిపుణులు ఉన్నా శిబిరాలను నిర్వహించటంలో వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. గతంలో డాక్టర్ కృష్ణమూర్తి రెడ్‌క్రాస్ ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు రెడ్‌క్రాస్‌కు పోటీగా రక్తదాన శిబిరాలను ప్రోత్సహించారు. తద్వారా పెద్ద ఎత్తున రక్తం సేకరణ జరిగేది. అయితే ప్రస్తుతం వ్యాధిగ్రస్తుల సహాయకులు ఇచ్చే రక్తదానంపైనే ఆధారపడుతుంది. ఈ నేపథ్యంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఇచ్చే రక్తం పైనే ఇక్కడ వైద్యులు ఆధార పడుతున్నారు. ప్రస్తుతం రెండు ప్రత్యేక బస్సుల ద్వారా రక్తాన్ని సేకరించే సదుపాయం రెడ్‌క్రాస్‌కు ఉంది. నారాయణ, అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల బ్లడ్ బ్యాంక్‌లు కూడా ఏటా వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తూ రక్తదాతలను ప్రోత్సహిస్తున్నాయి. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి ఏరియా ఆసుపత్రుల్లోని బ్లడ్ బ్యాంక్‌లు రెడ్‌క్రాస్ సహకారంతో రక్తాన్ని సేకరిస్తున్నాయి. నగరంలో నోవా, నెల్లూరు, విజయ బ్లడ్‌బ్యాంకులు కూడా రక్తం సేకరిస్తున్నాయి.


రక్తదానం చేస్తున్న యువకులు

కావాల్సి రక్తాన్ని సేకరిస్తున్నాము

జిల్లాలో దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తున్నాము. అయితే అవసరాలకు తగ్గట్టు సరిపోవడం లేదు. దాతల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం రెడ్‌క్రాస్ రక్తనిధిలో ఉన్న 140 మంది తలసీమియా వ్యాధిగ్రస్థులకు ఉచితంగా నెలకు 330 యూనిట్ల రక్తం అందిస్తున్నాం. సమాజంలోని ప్రతీ 100 మందిలో ఐదుగురు మాత్రమే రక్తదానం చేస్తుండగా ఆ సంఖ్య 15కు పెరగాలి.



- వాకాటి విజయకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్

రక్తనిధి ద్వారా సేకరిస్తున్నాము

జీజీహెచ్‌లోని రక్తనిధికి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు అన్నీ ప్రయత్నాలు చేస్తున్నాం. రక్తదాన శిబిరాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం జీజీహెచ్ రక్తనిధిలో ఇద్దరు ట్రాన్స్‌ఫ్యూజ న్ మెడిసిన్ చేసిన వైద్యులు అందు బాటులో ఉన్నారు.



- డాక్టర్ కొండేటి మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్

చోళుల పాలనలో ఆలయాల అభివృద్ధి

● పురావస్తుశాఖ సంచాలకుడు మునిరత్నంరెడ్డి



రాపూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 12వ శతాబ్దం నాటి చోళులు ప్రధానంగా ఆలయాల అభివృద్ధికి పాటుపడ్డారని భారతీయ పురావస్తుశాఖ సంచాలకులు కే.మునిరత్నంరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇటీవల రాపూరు మండలం మునగాల వెంకటాపురం అటవీ ప్రాంతంలో లభ్యమైన పొత్తపు చోళుల కాలం నాటి శిలాశాసనంపై ఉన్న లిపి (అక్షరాలను) ద్వారా పొత్తపు చోళుల పరిపాలన, ఆలయాలకు భూదానం వంటివి జరిగాయని తెలిపారు. ఆ శిలాశాసనాన్ని బట్టి పొత్తపు చోళుల పాలన తమిళనాడును పరిపాలించే చోళరాజైన వీరరాజేంద్ర చోళులు (1178-1218) సామంతులుగా పొత్తపు చోళులు పరిపాలించే వారని వివరించారు. దొరికిన ఆధారాలను బట్టి అప్పట్లో రాజు సూరకుమారన్, ఆయన తండ్రి మధురాంతక పొత్తపిగా ఉండే వారని తెలిపారు. అప్పటికాలం ప్రకారం వలీశ్వరం డైయర్ దేవాలయం సన్నూర్ వద్ద ఉండేదని, ఈ ప్రాంతం సిరుకడైనాడు, సూరకుమారన్ రాజ్యంలో కలదని, ఈ రాజ్యాన్ని శకట్టి నాయకర్ పాలించే వారని వివరించారు. వీరి పాలనలోనే సుకుమారన్ నెల్లూరు ప్రాంత పరిధిలోనే రాజ్యాన్ని పాలిస్తున్నట్లు ఆధారాలున్నట్లు పేర్కొన్నారు. ఈ శిలా శాసనం మూడు పక్కలా రాసిన అక్షరాల ఆధారంగా ఈ వివరాలు తెలిసినట్లు ఆయన వివరించారు. ఆ రోజుల్లో భూదానాలు, దేవాలయాలకు అందేలా, అందులో జరిగే అనేక సేవల గురించి పొందుపరిచినట్లు తెలిపారు. ఆ రోజుల్లో శైవ, వైష్ణవ దేవాలయాలకు విరివిరిగా దానాలు చేయడంతోపాటు, వాటి అభివృద్ధికి తోడ్పడేవారని వివరించారు. మన పూర్వీకులు మనకు అందించిన వారసత్వ సంపదను కాపాడుకోవడంతోపాటు, దానిని భావితరాల కోసం భద్రపరచాలని మునిరత్నం రెడ్డి తెలిపారు.

ఒక్కో ట్యాంకర్‌కు 80 కిలోల ఆయిల్ కోత

● పోర్టులో కంపెనీల మోసాన్ని అరికట్టండి : యోగానంద్

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం పోర్టులో ఉన్న ఆయి ల్ కంపెనీల యాజమాన్యాలు ట్యాంకర్ల ఓనర్లను అన్యాయం చేస్తున్నాయని తిరుపతి జిల్లా శ్రీకాళ హస్తికి చెందిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఏ) కార్యదర్శి యోగానంద్ ఆరోపించారు. మంగళవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతోమాఆట్లాడుతూ ఈ మధ్యకాలంలో ప్రతిరోజు టాంకర్ల లోడింగ్‌లో 80 నుంచి 120 కిలోల వరకు ఆయిల్ తక్కువగా వస్తోందని పేర్కొన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మీ బ్రోకర్ల ద్వారా మెయిల్ పెట్టండి. చూస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. బ్రోకర్లు పలుమార్లు మెయిల్ పెట్టినా వారు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఒక లారీకి 100 కేజీలు అంటే రూ.13వేలు ఆయిల్ తక్కువ రావడంతో ట్యాంకర్ల ఓనర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూనికల కొలతలు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కస్టమ్స్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలకు ఆధారాలతో లేఖ రాయడం జరిగిందన్నారు. పది రోజులకు ఒకసారి అయినా జిల్లా ఉన్నతాధికారులు కంపెనీలలోకి వెళ్లి పర్యవేక్షించాలని కోరారు.

4న నెల్లూరులో బీసీల రౌండ్ టేబుల్ సమావేశం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఈ నెల 4వ తేదీన బీసీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటినా నేటికీ బీసీలు ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన వీరికి చట్టసభల్లో సీట్లు కేటాయించాలని ప్రభుత్వాలను కోరారు. దేశంలో 4300కుపైగా వెనుకబడిన కులాలు ఉన్నాయని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశానికి అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొత్త మినగల్లు ఘటనపై హోంమంత్రి సీరియస్

● కోవూరు ఎమ్మెల్యేతో మాట్లాడిన అనిత

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త మినగల్లులో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. జరిగిన ఘటనపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో ఆమె చర్చించి, వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్టు సమాచారం. మరోవైపు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌తో పాటు బాధిత కుటుంబాల సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, జగదీష్, హరికృష్ణ తదితరులు శ్రీకాంత్‌ను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ దుశ్చర్యలను తీవ్రంగా ఖండించారు.


శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

● పోలీసుల అదుపులో నలుగురు

టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన నిందితుల్లో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మిగతా వారి కోసం గాలిస్తున్నట్టు సమాచారం.

చిత్రజ్యోతి

SINCE 1965

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగి మణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిదుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

